ప్రజాశక్తి

సోమవారం 26 ఆగస్టు 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

పక్కా ఇళ్లు ప్రశ్నార్థకం

- లబ్ధిదారులకు భారంగా నిర్మాణం
- వ్యయం పెరిగి ఇబ్బందులు
- కాలనీల్లో పాక్షికంగానే మౌలిక సదుపాయల కల్పన

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గత ప్రభుత్వ హయాంలో పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా జిల్లాలో జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణం ఎప్పటికి పూర్తవుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో భూసేకరణ నుంచి ఇళ్ల నిర్మాణం వరకు అనేక అక్రమాలు జరిగాయని టిడిపి కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఎలా పూర్తి చేయాలన్న అంశంపై ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో 66,554 ఇళ్లు మంజూరు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర, పట్టణ ప్రాంతాల్లో సెంటు విస్తీర్ణంలో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వివిధ దశలో ఉన్నవి 35 వేలు కాగా ఇప్పటి వరకు పూర్తయినవి 18,556గా గుర్తించారు. ఇంకా ప్రారంభం కానివి 939 ఉన్నాయి. పునాది స్థాయిలో ఉన్న ఇళ్లు 11,552 కాగా వీటిని ఎప్పటికి పూర్తి చేస్తారన్నదీ అంతుబట్టడం లేదు.

నిర్మాణ వ్యయం భారీగా పెరిగిపోగా కేవలం రూ.1.80 లక్షల వ్యయంతో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. డ్వాక్రా మహిళలకు అదనంగా రూ.35 వేలు రుణం ఇప్పించారు. అయినా ఒక్కొ ఇంటి నిర్మాణానికి కనిష్టంగా రూ.5 లక్షల వరకు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. లబ్ధిదారులు తమ వాటాగా కొంత మొత్తం పెట్టుబడి పెట్టగలిగిన ప్రదేశాల్లోనే ఇళ్ల నిర్మాణం వేగంగా జరిగింది. స్థలం ఇచ్చి ప్రభుత్వం మొత్తం నిర్మాణాన్ని పూర్తి చేయాలన్న


తెనాలిలో పునాదికే పరిమితమైన ఇళ్లు

మూడో అప్షన్‌కు ఎక్కువ మంది లబ్ధిదారులు మొగ్గుచూపడం వల్ల చాలా కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పెండింగ్‌లో ఉండిపోయింది. 18 వేల ఇళ్లతో భారీ లేవుట్‌ను రూపొందించిన పేరేచర్ల లేవుట్‌లో కేవలం 3 వేల ఇళ్ల నిర్మాణం కూడా జరగలేదు. కాంట్రాక్టరు ఇళ్లనిర్మాణంపై వెనుకంజ వేయడం, ఈ లోగా ఎన్నికల కోడ్ రావడంతో నిర్మాణాలు ఆగిపోయాయి.

ప్రస్తుతం 80 నుంచి 90 శాతం పూర్తి అయిన ఇళ్లను పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులకు సూచించింది. ప్రధానంగా శ్లాబు స్థాయికి వచ్చిన ఇళ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో భాగంగా నెలకు 3 వేల ఇళ్ల చొప్పున పూర్తి చేయడానికి ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలిచ్చారు. ప్రస్తుతం వివిధ దశలో ఉన్న 35 వేల ఇళ్లను పూర్తి చేయడానికి కనీసం ఏడాది కాలం పట్టే అవకాశం ఉంది. పునాదుల్లో ఉన్న 11 వేల ఇళ్లను, అసలు ప్రారంభించని 939 ఇళ్ల నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందనేది పెద్ద ప్రశ్నగా మిగిలిపోయింది. మరోవైపు కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనలో జాప్యమవడంతో చాలా ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాలేదు. గుంటూరు పరిసర ప్రాంతాల్లో నివశిస్తున్న దాదాపు 20 వేల మందికి కొర్నెపాడు ప్రాంతంలో రెండు భారీ లే అవుట్‌లను రూపకల్పన చేసినా వీటిల్లో మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం వల్ల వీటిల్లో ఒక్క ఇల్లు కూడా పూర్తి కాలేదు. ఇప్పటి వరకు మంజూరు చేసినవి కాకుండా ఇళ్లస్థలాలు ఇచ్చినా ఇళ్లు మంజూరు కాని లబ్ధిదారుల సంఖ్య మరో 33 వేల మంది వరకు ఉన్నారు. వీరందరికి ఇళ్ల నిర్మాణం ఎప్పటికి పూర్తి చేస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.


పోలీసులు స్వాధీనం చేసుకున్న గొడ్డళ్లు, కర్రలు, బాణసంచా

కల్తీలకు అడ్డుకట్ట వేస్తాం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని వరవకట్టలో 100 మంది సిబ్బందితో ఆదివారం తెల్లవారుజామున డీఎస్సీ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి రావడంతో తనిఖీలు చేపట్టినట్లు డీఎస్పీ చెప్పారు. సరైన ధ్రువపత్రాలు లేని 46 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలను సీజ్ చేశారు. 6 గొడ్డళ్లు, కర్రలు, బాణసంచా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. గుర్తింపు కార్డులేమీ లేని బీహార్, ఒడిస్సా రాష్ట్రాలకు చెందిన 18 మందిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. స్వాధీనం చేసుకున్న వాహనాలకు సంబంధించి వాహన యజమానులు వాహన ధ్రువీకరణ పత్రాలు చూయించి వాహనాలు తీసుకువెళ్లచ్చని చెప్పారు. వాహన దారులు తప్పనిసరిగా వాహన ధ్రువీకరణ పత్రాలతోపాటు లైసెన్స్ దగ్గర పెట్టుకోవాలని, హెల్మెట్ ధరించాలని చెప్పారు. కల్తీ పాలకు, కల్తీ పురుగు మందులు ఎరువులకు అడ్డాగా ఉన్న నరసరావుపేటలో అసాంఘిక కార్యక్రమాలు అడ్డు కట్ట వేయడం కోసం పటిష్ట చర్యలు చేపట్టామన్నారు.

10 కిలోల గంజాయి స్వాధీనం

శనివారం రాత్రి గుంటూరు రోడ్డులోని టూటౌన్ పోలీసులు తనిఖీలు చేపట్టి ఇద్దరు మహిళల వద్ద 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతోపాటు ఇద్దరు మహిళలు, మరొకర్ని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.62 వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు


వరకట్టలో పర్యటిస్తున్న డీఎస్పీ కె.నాగేశ్వరరావు

రాజధానిలో విస్తరిస్తోన్న వ్యాపార రంగం 5లో

కొత్త క్రిమినల్ చట్టాలతో ప్రజాస్వామ్యానికి చేటు 5లో

ఉద్యాన పంటలకు రూ.11.61 కోట్లు రాయితీ 8లో

తెనాలి సబ్ కలెక్టర్‌గా సంజనా సిన్హా

బాపట్ల జెసిగా ప్రఖర్ జైన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తెనాలి సబ్ కలెక్టర్‌గా జూనియర్ ఐఎఎస్ అధికారి సంజనా సిన్హా నియమితులయ్యారు. 2022 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన ఆమె శిక్షణ అనంతరం ప్రొబెషనరీ ఐఎఎస్ అధికారులకు ఆదివారం ప్రభుత్వం తొలి పోస్టింగ్‌లను ఇచ్చింది. ఇందులో భాగంగా సంజనా సిన్హాను తెనాలి సబ్ కలెక్టర్‌గా నియమించారు. ఇప్పటి వరకు సబ్ కలెక్టరుగా ఉన్న ప్రఖర్ జైన్ ఇటీవల విశాఖ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆ తర్వాత ఆ ఆదేశాల మార్చారు. తాజాగా ఈనెల 31 ఉద్యోగ విరమణ చేయనున్న జాయింట్ కలెక్టర్ సుబ్బారావు స్థానంలో ప్రఖర్ జైన్‌ను బాపట్ల జిల్లా జాయింట్‌గా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మీరబ్ కుమార్ ప్రసాద్ ఆదివారం ఉత్తర్వులిచ్చారు.

నేటి నుండి క్రీడోత్సవాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నుండి 31వ తేదీ వరకూ క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఉత్సవాలు నరసరావుపేట పట్టణం సత్తెనపల్లి రోడ్డు లోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణంలో ఉంటాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించే ఈ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందని, ఆసక్తి ఉన్న క్రీడాకారులు జట్ల పేర్లను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. 2023-24లో జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్న క్రీడాకారులను సత్కరించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, మరిన్ని వివరాలకు 8712622574 సెల్‌ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

అవుట్ డోర్ క్రీడలు

వాక్/రేస్ వాలీబాల్, హాకీ (పెనాల్టీ షూట్ అవుట్), మినీఫుట్బాల్, టెన్నిస్ బాల్ క్రికెట్

ఇండోర్ క్రీడలు

బ్యాడ్మింటన్, చెస్, బాస్కెట్ బాల్, టేబుల్ టెన్నిస్, టగ్ ఆఫ్ వార్

సంప్రదాయ క్రీడలు:

లెమన్ రేస్/సాక్ రేస్, రోప్ జంపింగ్, ఖోఖో, లగోరీ/లంగరి, ప్లాంక్ ఛాలెంజ్.



రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రక్తం ద్వారా ఎంతోమంది ప్రాణాలు కాపాడవచ్చని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. ఆదివారం లాలాపేట్‌లోని గర్ల్స్ హైస్కూల్లో డాక్టర్ బి.రవికుమార్ స్ఫూర్తితో బాలాజీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే నసీర్ ప్రారంభించారు. అన్ని దానాల కంటే రక్తదానం గొప్పదని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి వారి ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. రక్తదానంపై ప్రజల్లో చైతన్యం పెంచే బాధ్యత యువత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, డాక్టర్ రవి, డాక్టర్ చంద్రశేఖరే, ప్రభాకర్, మనోజ్, శ్రీనివాస్, నూరుద్దీన్, సలీం, హఫీజ్ పాల్గొన్నారు.


కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్ చెంచిరెడ్డి

షుగర్ పేషెంట్లకు ఉచితంగా కంటి పరీక్షలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్లలోని డాక్టర్ రామలింగారెడ్డి మాక్సీవిజన్ కంటి హాస్పిటల్‌లో ఆదివారం ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. షుగర్ వ్యాధితో కంటి చుప్పు దెబ్బతిన్న వారికి ప్రముఖ రెటీనా స్పెషలిస్ట్ డాక్టర్ చెంచిరెడ్డి, డాక్టర్ హరిత, డాక్టర్ అనిషా ప్రియా పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. హైదరాబాదు లాంటి పెద్ద నగరాల్లో మాత్రమే ఉండే అత్యంత ఆధునిక పరికరాలచే మాచర్లలోనే డాక్టర్ రామలింగారెడ్డి మాక్సీవిషన్ కంటి హాస్పటల్ నందు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సుమారు 200 మందికి కంటి పరీక్షలు చేశారు.

నేడు కృష్ణాష్టమి వేడుకలు, అన్నదానం

ప్రజాశక్తి-తాడేపల్లి

కృష్ణాష్టమి సందర్భంగా తాడేపల్లి నెహ్రూ బొమ్మ సెంటర్‌లోని కృష్ణుని గుడి వద్ద సోమవారం వేడుకలకు ఏర్పాట్లు పూర్తయినట్లు నిర్వాహకులు తెలిపారు. గుడికి ఇరువైపులా లైటింగ్ ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటలకు అన్నసంతర్పణ, సాయంత్రం 4 గంటలకు ఉట్టికొట్టుట, 7 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. పెనుమాక శ్రీకృష్ణ యాదవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఊరేగింపు నిర్వహించారు. వెన్నముద్ద వేలం రూ.1.10 లక్షలకు మన్నవ రామారావు పాడారు. కార్యక్రమంలో కె.రంగబాబు, నాగరాజు, కొల్లి శేషు, వీరేంద్రనాథ్, చెన్నుబోయిన రాజేష్ పాల్గొన్నారు.



అధికారం ఇస్తేనే స్థానిక సంస్థలు బలోపేతం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక సంస్థలు బలోపేతం కావాలంటే విధులు, నిధులు, అధికారాలు బదలాయించాలని మాజీ రాజ్యసభ సభ్యులు యన్.తులసీరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వాల సాధికారతపై గుంటూరులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన చర్చా గోష్టికి జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. తులసీ రెడ్డి ప్రసంగిస్తూ రాజ్యాంగంలో ఆర్టికల్ 243 పేర్కొనట్లుగా స్వయం పాలక ప్రభుత్వాలుగా స్థానిక సంస్థలకు అధికారాలివ్వాలన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల నిధులను దారి మళ్లించి వాటిని నిర్వీర్యం చేసిందన్నారు. వాలంటరీ, సచివాలయ వ్యవస్థలను పంచాయతీలకు సమాంతర వ్యవస్థలుగా మార్చి సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మిగిల్చారని తెలిపారు. శాసన మండలి సభ్యులు కె.యస్. లక్ష్మణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని నియమించకుండా రాష్ట్ర ఆర్థిక సంఘం నుండి ఎలాంటి నిధులను స్థానిక ప్రభుత్వాలకు ఇవ్వలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాలు అందించే నిధులు దారి మళ్ళించకుండా స్థానిక ప్రభుత్వాలకు చేరేలా చట్టాలను బలోపేతం చేయాలన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ గ్రామాలు అభివద్ధి చెందకుండా దేశాభివద్ధిని ఆశించలేమన్నారు. నిర్మాణాత్మకమైన కార్యచరణతో కులాల మధ్య సమన్వయంతో గ్రామాభివృద్ధిని సాధించగలమన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్టిసిపేషన్ కార్యాచరణ ద్వారా స్థానిక ప్రభుత్వాలు వికసిస్తాయన్నారు. మహాత్మా గాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీంలో ఎలాంటి అవినీతి లేకుండా గ్రామపంచాయతీలలో అమలు చేస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల అభివద్ధికి కషి జరగాలని, స్థానికేతరుల సహకారం తీసుకొని అభివద్ధి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. సిపిఐ రాష్ట్ర సహయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు ప్రసంగిస్తూ యం. యల్.ఎ ల చేతులలో అధికారం కేంద్రీకతం అవడం వలన అధికార, పాలన వికేంద్రీకరణకు ఆస్కారం లభించడం లేదన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వాల నిధులు, విధులు, అధికారాల పై విస్తతంగా చర్చలు జరగాలని, ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిలకలపూడి పాపారావు ప్రసంగిస్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో గ్రామసభలు విజయవంతంగా జరిగాయని, కేంద్ర ఆర్థిక నిధులు విడుదలయ్యాయని తెలిపారు. అమరావతి బహుజన జెఎసి అధ్యక్షులు పోతుల బాలకోటయ్య, అఖిలభారత పంచాయితీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు, ప్రముఖ హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు, ఉమ్మడి గుంటూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కల్లూరి శ్రీనివాసరావు జన చైతన్య వేదిక రాష్ట్ర కార్యదర్శి పి శేషుబాబు నేస్తం సహా వ్యవస్థాపకులు ధనుంజయరెడ్డి మాట్లాడారు.

చర్చా గోష్టిలో తీర్మానాలు ఆమోదం

73 వ రాజ్యాంగ సవరణలో గ్రామీణ ప్రాంతాలలో పేర్కొన్న 29 అంశాలను, 74వ రాజ్యాంగ సవరణలో పట్టణ ప్రాంతాలకు పేర్కొన్న 18 అంశాలను దశల వారీగా



రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ప్రభుత్వాలకు బదలాయించాలని సమావేశంలో తీర్మానం చేశారు. గ్రీన్ అంబాసిడర్స్ జీతాలు 6000 నుండి రూ. 10000 రూపాయలకు పెంచాలన్నారు. 5 వ రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులను వెంటనే స్థానిక ప్రభుత్వాలకు బదిలీ చేయాలని, 15వ కేంద్ర ఆర్థిక సంఘం నిధులను ఇచ్చిన వెంటనే స్థానిక ప్రభుత్వాలకు ఎలాంటి జాప్యం లేకుండా బదిలీ చేయాలన్నారు.రాజకీయాలకు అతీతంగా సర్పంచులందర్నీ ఒకే విధంగా చూడాలి. వివక్షత చూపరాదన్నారు. ఉపాధి హామీ పథకాన్ని ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా అమలు చేయాలి. గ్రామాల అభివద్ధికి ఈ పథకాన్ని సంపూర్ణంగా వినియోగించుకోవాలన్నారు.

తెలుగు భాషా దినోత్సవాల్లో ఆళ్లకు సత్కారం

ప్రజాశక్తి - తెనాలి

కొండవీడు రచయితల సంఘం ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన కవి రచయిత ఆళ్ళ నాగేశ్వరరావు ను సత్కరించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ఫిరంగిపురం లో ముందస్తు గా జరిగిన తెలుగుభాషా దినోత్సవ వేడుకలలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనంలో నాగేశ్వరరావు పాల్గొని 'తెలుగు పలుకు వైభవం' అనే వచన కవితను వినిపించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి విశిష్ట అతిధి గా పాల్గొన్న ఆచార్య డాక్టర్ బూసి వెంకటస్వామి, కొండవీడు రచయితల సంఘం అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు పాల్గొని తనను జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో సత్కరించినట్లు ఆళ్ల తెలిపారు.

కొరిటపాడు వాకర్స్ అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు : కొరిటపాడు ట్యాంక్‌బండ్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. ఈ అసోసి యేషన్ ఎన్నికలకు చాగంటి రఘురామిరెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అధ్యక్షులుగా కన్న సాని బాజీ, సెక్రెటరీ బెజవాడ శివరామకృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌లుగా ఇమడాబత్తిని కోటేశ్వరరావు, ఎ.గంగా ధర్, ట్రెజరర్ ఓబులురెడ్డి, సత్యనారాయణ, లేళ్ల రత్తయ్య, జాయింట్ సెక్రెటరీగా గల్లా గురూపాదం, ఇసి సభ్యులు రవీంద్ర, విష్ణువర్ధన్, రామకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి ఎన్నిక య్యారు. గౌరవాధ్యక్షులుగా జి.రత్నారెడ్డి ఎన్నికయ్యారు.

ఎపిఆర్‌జెసిలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం విజయపురిసౌత్‌లోని ఏపీఆర్ జూనియర్ కళాశాల గోల్డెన్ జూబ్లీని పురస్కరించుకుని సాగర్ పరివార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత మెడికల్ క్యాంపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. 400 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ మెడికల్ క్యాంపులో బీపీ, డెంటల్, స్కిన్, ఆర్థోపెడిక్, గ్యాస్ట్రో, రుమటాలజీ తదితర వైద్య పరీక్షలు చేశారు. 50 మందికి కంటిపరీక్షలు చేసి 20 కళ్ళ కంటిఅద్దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సాగర్ పరివార్ ప్రెసిడెంట్ మల్లికార్జునరావు, జనరల్ సెక్రటరీ వీర నంది, ట్రెజరర్ విజయకుమార్, క్యాంపు కో-ఆర్డినేటర్ డా.చక్రపాణి,వైస్ ప్రెసిడెంట్ సైదారెడ్డి, నాగచారి, పూర్వ విద్యార్థి రిటైర్డ్ డిజిపి వెంకటేష్, దంత వైద్యులు వివేకానంద వర్ధన్, ప్రిన్సిపల్ సరోజిని, పూర్వ విద్యార్థి రమేష్ నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గోళ్లపాడు కెజిబివిలో సరుకులు పక్కదారి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని గోళ్లపాడు గ్రామంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత నిత్యావసర సరుకుల తరలింపు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పాఠశాలలో సరుకులను సిబ్బంది బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి కెజిబివిలోని నిత్యావసర సరుకులను తీసుకెళ్లేందుకు ఆటో పాఠశాలలోకి రావడంతో గుర్తించిన స్థానికులు కొందరు ఆటోను వీడియో తీసి ఉన్నతాధికారులకు పంపారు. విషయం బయటకు పొక్కడంతో కెజిబివి సిబ్బంది ఆటోను అక్కడ నుంచి హుటాహుటిన పంపించేశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు జిసిడివో రేవతి, ఇన్‌ఛార్జి ఎంఇఒ శ్రీనివాసరావు కెజిబివిని సందర్శించి రికార్డులను పరిశీలించారు. రికార్డులలో నిల్వలకు కొద్దిపాటి తేడాలున్నట్లు, నిత్యావసర వస్తువులు తగ్గినట్లు గుర్తించడంతోపాటు రికార్డుల నిర్వహణలో కూడా లోపాలున్నట్లు గుర్తించామన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని చెప్పారు.

స్వీపర్ల కొనసాగింపుపై అస్పష్టత

పని చేసినా నెలల తరబడి జీతాలందక ఇక్కట్లు - విధుల్లో కొనసాగుతూ పని

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పని ఉంటుందో లేదోనని ఒకపక్క ఆందోళన, జీతాలు ఎప్పటికొస్తాయోనని నిరీక్షిస్తూ అర్థాకలితో అలమటిస్తున్నామని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో స్వీపర్లు వాపోతున్నారు. నెలల తరబడి జీతాలు రాలేదని చెబుతున్నారు. చిలకలూరిపేట పట్టణం, మండల పరిధిలో మొత్తం 89 ప్రాథమిక పాఠశాలలు, 18 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 130 మంది వరకూ స్వీపర్లు పని చేస్తున్నారు. 300 మంది విద్యార్థులుంటే ఇద్దరు స్వీపర్లు, 300-600 మంది మధ్య ఉంటే నలుగురు స్వీపర్లు చొప్పున గతంలో నియమించారు. గత ప్రభుత్వ హయాంలో అమ్మఒడి పథకంలో భాగంగా విద్యార్థుల తల్లులకు జమయ్యే నిధుల్లో రూ. రెండు వేలు తగ్గించి ఆ మొత్తంతో స్వీపర్‌కు రూ.5 వేలు చొప్పున జీతం ఇచ్చేవారు. నగదును మొదట ఎంఇఒ ఖాతాలో వేసినా క్రమంగా స్వీపర్ల ఖాతాల్లోనే జమ చేయనారంభించారు. ప్రస్తుతం రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో స్వీపర్ల కొనసాగింపుపై సందిగ్ధత నెలకొంది. ఈ ఏడాది జనవరి నుండి వీరికి జీతాలు జమ కాలేదు. విధులకు సంబంధించి ఎంఇఒ, హెచ్‌ఎంల నుండి కూడా సరైన ఆదేశాలు రాలేదు. అయినా మరుగుదొడ్లు శుభ్రం చేయడానికి గతేడాది సరఫరా చేసిన వస్తువులు ఉండడంతో తాము పని చేస్తూనే ఉన్నామని స్వీపర్లు చెబుతున్నారు. తమ బకాయి జీతాలు విడుదల చేయడంతోపాటు తమను కొనసాగిస్తూ కనీస వేతనాలు ఇచ్చేలా ప్రభుత్వం ప్రకటించాలని స్వీపర్లు కోరుతున్నారు.

ప్రతి విద్యార్థీ లక్ష్యాన్ని సాధించాలి : కేంద్ర మాజీ మంత్రి



విద్యార్థికి ఉపకార వేతనం అందజేస్తున్న కేంద్ర మాజీ మంత్రి జెడి శీలం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకొని కష్టపడి, ఇష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించి తమ తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేసి దేశానికి సేవలందించాలని కేంద్ర మాజీ మంత్రి జెడి.శీలం అన్నారు. ఆదివారం స్థానిక సాయి అన్నపూర్ణాలయంలో పెదనందిపాడు ఎడ్యుకేషనల్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో పేద మెరిట్ విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. దీనికి పారిశ్రామికవేత్త అరవల్లి కృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి జెడి.శీలం మాట్లాడుతూ తాను అతి సామాన్య కుటుంబంలో పుట్టానని, కలెక్టర్ కావాలనే లక్ష్యంతో పది కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు కాలినడకన వెళ్లి చదువుకున్నానని అన్నారు. కష్టంలోనే సుఖపడుతూ చదువుకొని కలెక్టర్ జాబ్ చేస్తూనే, కేంద్ర మంత్రికి సూచనలు ఇస్తూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలనే లక్ష్యంతో కేంద్రమంత్రిని అయ్యానని పేర్కొన్నారు. నేటి విద్యార్థులకు తన జీవితం ఒక స్ఫూర్తి కావాలని ఈ విషయాన్ని మీ ముందు ఉంచుతున్నాను అన్నారు. ఏపీ స్పిన్నింగ్ మిల్ అసోసియేషన్ ఛైర్మన్ పెరవలి కోటి రావు మాట్లాడుతూ మెరిట్ సాధిస్తున్న పేద విద్యార్థులకు చేయూతనిస్తున్న పెదనందిపాడు ఎడ్యుకేషనల్ చారిటబుల్ సొసైటీ వారిని అభినందిస్తూ ఈ ప్రాంతంలోని పారిశ్రామికవేత్త విద్యావేత్త దాసరి శేషగిరిరావు సేవలను కొనియాడుతూ తానూ తమ తిరుమల గ్రూపు ద్వారా ఈ సొసైటీకి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అనంతరం 102 మంది మెరిట్ పేద విద్యార్థులకు రూ.7.60 లక్షలు వారి చదువుల నిమిత్తం స్కాలర్షిప్ల ద్వారా సహాయ సహకారాలు అందించారు. ఈ కార్యక్రమంలో దాతలు దాసరి శేషగిరిరావు. గేరా రత్నం. ముద్దన రాఘవయ్య . డిసత్యనారాయణ. టి సురేష్. డి ఎల్ ఎస్. ప్రసాదు. వి. వి గుప్తా. జవహర్ రాణి. కెసాయి ప్రసాద్. పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు, పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - చిలకలూరిపేట

దాతల సహాయాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు గొప్ప విద్యావంతులుగా ఎదగాలని ఇన్నర్ వీల్ క్లబ్ చిలకలూరిపేట అధ్యక్షురాలు గట్టు సరోజిని తెలిపారు. ఆదివారం బీసీ బాలుర వసతి గృహంలో 45 మంది విద్యార్థులకు దుప్పట్లు, పెన్నులు, పుస్తకాలు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. క్లబ్‌చార్టర్ ప్రెసిడెంట్ చిలుకూరి సుబ్బాయమ్మ ఆర్థిక సహాయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నార్నే జయలక్ష్మి, హాస్టల్ వార్డెన్ పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు ప్రజలు సహకరించాలి : సిఐ

ప్రజాశక్తి - పొన్నూరు



పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు తమవంతు సహకారం అందించాలని పొన్నూరు అర్బన్ స్టేషన్ సిఐ రవికిరణ్ ఆదివారం అన్నారు. శనివారం ఆయన నూతన ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎవరైనా కోడి పందెలు, పేకాట, మట్కా నిర్వహించే వారి సమాచారం అందించాలని అలాంటి వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. క్రికెట్ బెట్టింగులతో పాటు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకుముందు ఆయన తిరుపతి జిల్లా గూడూర్ టూ టౌన్ సిఐగా పని చేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన అర్బన్ సిఐ పి .భాస్కర్‌ను వీఆర్‌లో రిపోర్టు చేయాలని డీసీపీ జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పేద, మధ్యతరగతి వారి కోసమే 'కో-ఆపరేటివ్'



నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న మానం ఆంజనేయులు,

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

సహకార వ్యవస్థ పేద మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలనే లక్ష్యంతో విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకును స్థాపించినట్లు సహకార వ్యవస్థాపకులు మాజీ ఎమ్మెల్యే, బ్యాంకు మాజీ ఛైర్మన్ మానం ఆంజనేయులు అన్నారు. ఆదివారం నరసరావుపేట పట్టణంలో ఆ బ్యాంకు 52వ శాఖను ప్రారంభించారు. అనంతరం సభను ఏర్పాటు చేశారు. దీనికి ది-విశాఖపట్నం కో-పరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజం మార్పును కోరుకుంటోందన్నారు. 2025 మార్చి నాటికి తమ బ్యాంక్ రూ.ఎనిమిదివేల కోట్లు లక్ష్యంగా డిపాజిట్ల సేకరణ ఉంటుందన్నారు. తమ బ్యాంకు లక్ష్యం పరస్పర సహకారంగా ఉంటుందన్నారు. ప్రభుత్వాల నుండి సహాయ సహకారాలు అడిగితే కోపరేటివ్ వ్యవస్థ ఉండదన్నారు. పాలకవర్గాల అసమర్థత వల్లే ఎక్కువ బ్యాంకులు మునిగిపోతున్నాయని అన్నారు. పాలకవర్గం, ఉద్యోగులు, సభ్యులు కలిసి ఉంటేనే సహకార వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. ప్రభుత్వాలు చట్టాలు తయారు చేసే సమయంలో పాలక వర్గాలతో సంప్రదించి నూతన ఆలోచనా మార్గం అన్వేషించాలన్నారు. నరసరావుపేట బ్రాంచ్‌లో డిపాజిట్లు వచ్చిన రాకపోయినా రూ.100 కోట్ల రుణాలు ఇవ్వడం ఖాయమన్నారు. పేద మధ్యతరగతి కుటుంబాలు వారి జీవన స్థితిగతులు మెరుగు పరచాలన్నారు. ది. విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ కోఆపరేటివ్ బ్యాంకులు ప్రజల విశ్వాసం మీద కొనసాగుతూ ఉన్నాయన్నారు. దక్షిణ భారతదేశం లోనే విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ అతిపెద్ద బ్యాంక్‌గా రూపాంతరం చెందిందన్నారు. ఈ ఏడాది 12 లక్షల మందికి రూ 39 కోట్లు డివిడెండ్ ఇచ్చామన్నారు. మెడికల్ పాలసీ ద్వారా ఒక్కొక్కరికి రూ 50 వేలు చెల్లిస్తామన్నారు. బ్యాంకు సభ్యులైన 478 పిల్లలకు రూ.30 లక్షలకుపైగా అవార్డు అందించామన్నారు. దేశంలోనే ది-విశాఖ పట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ 3వ స్థానంలో ఉందన్నారు. ఈ సమావేశంలో విశిష్ట అతిథులుగా ది-గుత్తి కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ ఛైర్మన్, ది-ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్, క్రెడిట్ సొసైటీ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు షేక్‌అబ్దుల్, ది-గుంటూరు కో-పరేటివ్ అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ బొనబోయిన శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి

నా క్లయింట్ అయిన గుంటూరు జిల్లా తాడికొండ మండలం బండారుపల్లి గ్రామం డోర్ నెం.6-40 కాపురస్తులు ముప్పాళ్ళ నరసింహారావు భార్య ముప్పాళ్ళ రోజారాణి వలన సమాచారం పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ ది:2-11-2018 న ఎస్.ఆర్.ఓ గుంటూరు ద్వారా కొనుగోలు చేసిన విక్రయ దస్తావేజు నెం. 4856/2018 గుంటూరు డివిజన్ కొరిటెపాడు సబ్ డివిజన్ ప్రస్తుతం జి.ఎం.సి లో చేరిన గుంటూరు సిటీ గోరంట్ల యర్రంశెట్టి వారి వీధినందలి గోరంట్ల గ్రామం తాలుకు డి.నెం.34/2రు. మింజుమలె చ.గ. 126లు స్థలం, ఇందలి డోర్‌నెం. 4-96రు అసెస్మెంట్ నెం.630రు గల ఆర్.సి.సి ఇల్లుకు సంబంధించిన పైన తెలిపిన ఒరిజినల్ దస్తావేజును ది.17-08-2024న నరసరావుపేటలో అరండల్‌పేట నుండి ఆటలో జిరాక్స్ నిమిత్తం వెలుతుండగా మార్గం మధ్యలో ఎక్కడో పడిపోయినది ఎంత వెతికిననూ దొరకలేదు సదరు దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల నా క్లయింట్ గానీ, నాకు గానీ లేదా 9052516916 నెం. నందు సంప్రదించగలరు. అట్లు గాక సదరు దస్తావేజులు ఎవరికైన దొరికి వాటిని దుర్వినియోగ పరిచిన అన్యాక్రాంతములు జరిపిన నా క్లయింట్ తీసుకొను చట్టపరమైన సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు భాద్యులగుదురని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

ఇట్లు
కడియాల శ్రీరాములు(శ్రీరామ్)
అడ్వకేట్ గుంటూరు.

IN THE COURT OF THE HON'BLE ADDL. SENIOR CIVIL JUDGE, NARASARAOPET
I.P. No. 08/2023

Between :
Dhulipalla Srikanth .... Petitioner
Vs
1) Bhavanam Suresh Reddy
2) Upputuri Aravind
3) Sudalaguntla Sri kanth
4) Karri Rama Rao
5) Chintapalli Ashok
6) Kosindala Madanmohan
7) Kommineni Rambabu
8) Sudalaguntla Hanumantha Rao
9) Mukkapati Koteswara Rao
10) Indlamuri Veeranjaneyulu
11) Vajja Rajendra Prasad
12) Indlamuri Anjeneyulu
13) Sudalaguntla Chennakesava Swamy
14) Makkapati Gopinadh
15) Kasindula Haribabu
16) Satuluri Bhaskar
17) Kandula Subbareddy
18) Darvuri Amarnadh
19) Bandlamudi Koteswara Rao
20) Kandula Prudhvi
21) Kandula Venkateswarlu
22) Dhulipala Rama Krishna.
..... Respondents

పై నెంబరు ఐ.పి. దావాలో పిటీషనర్ ఇందలి రెస్పాండెంట్స్‌పై ఐ.పి. దాఖలు చేసి సదరు పిటీషనర్‌ను ఇన్‌సాల్వనర్‌గా డిక్లేర్ చేయమని కోరియున్నాడు. సదరు ఐ.పి.లోని రెస్పాండెంట్స్ R19 మరియు R20 లకు శ్రీ కోర్టువారు పంపించిన నోటీసును ఉండి కూడా తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా తిప్పి పంపుచున్నారు. సదరు విషయాన్ని కోర్టువారి దృష్టికి తీసుకొని వెళ్ళగా శ్రీ కోర్టువారు ప్రత్యామ్నాయ సర్వీసు క్రింద సదరు పై పేపరుకు ఆర్డరు ఇచ్చియున్నారు. పబ్లికేషన్ నిమిత్తం దీనినే ప్రత్యామ్నాయ సర్వీసుగా భావించి సదరు R19 & R20 ప్రతివాదులు కోర్టుకు హాజరు కాగలరు. ది. 05-09-2024 ఉదయం 10-30 గం.లకు సదరు R19 & R20 లు ది. 05-09-2024న కోర్టుకు మీరు గానీ, మీ తరఫున అడ్వకేటుగానీ హాజరయి మీ ఆక్షేపణలు తెలుపగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదాతేది : 05-09-2024
సమయం : ఉదయం 10-30 గం.లకు
నరసరావుపేట.

సిందుకూరి శ్రీనివాసరావు,
అడ్వకేట్, నరసరావుపేట.
పల్నాడుజిల్లా.

లాడ్జీ యజమాని ఆత్మహత్యా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరులోని రైలు పేటలో ఒక వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. రైలు పేటలోని శ్రీలేఖలాడ్జీ యజమాని ఆదినారాయణ కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో మానసికంగా బాధపడుతున్నాడు. ఈ క్రమంలో లాడ్జిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించారు. అతన్ని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఫౌండర్స్‌డే

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఏపీ ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీలో ఫౌండర్స్ డే వేడుకలను ఘనంగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ ఆవరణలోని ప్రేరణ వనంలో వైస్ చాన్సులర్ ఆచార్య మనోజ్ కుమార్ ఆరోరా పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను తెలియ జేస్తూ వివిధ రకాల మొక్కలను నాటారు. అనంతరం మంగళగిరి, కాజా ప్రాంతాల్లోని అనాధ విద్యార్థులు, వయో వద్దులకు పండ్లు పంపిణీ చేశారు. మధ్యాహ్నం రెండు గంటలకు యూనివర్సిటీ ఆడిటోరియంలో రెండవ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది వైస్ ఛాన్స లర్ మనోజ్ అరోరా, రిజిస్ట్రార్ ఆర్ ప్రేమ్ కుమార్ లు ప్రసంగించారు. యూనివర్సిటీ అభివద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని వీసీ కోరారు. యూనివర్సిటీ పూర్వ విద్యార్థిని మరియు దక్షిణ భారత సినీ నటి కుమారి ఈశ్వరి మీనన్ ఆన్ లైన్ పద్ధతిలో కార్యక్రమం లో పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో డైరెక్టర్ లు రేవతీ, అనూప్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - నాదెండ్ల



నాదెండ్లలో డాక్టర్ ఎంవి.రెడ్డి ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నాదెండ్ల సాయిబాబా గుడిలో ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరానికి 82 మంది వచ్చారు. వారిలో 46 గురికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ ఫ్రీగా చేయబడుతుందని నిర్వాహకులు తెలిపారు. మిగిలివారికి కళ్ళజోళ్ళు 30 శాతం తగ్గింపు ధరతో ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జూనియర్ డాక్టర్ వెంకట్ రెడ్డి, పిఆర్‌ఓ దిలీప్, స్టాఫ్ సరళ, సాగర్, తిరుపతమ్మ, సారా, వేములపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

రూ.15,100 పట్టివేత - 9మంది అరెస్టు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్, పెదవడ్లపూడి గ్రామ పరిధిలో గల ఫ్లైఓవర్ కింద ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్న వారిపై మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్, మధుసూదన్ రావు ఆధ్వర్యంలో దాడి చేసుకొని పట్టుకున్నారు. ఈ దాడిలో 9 మందిని అరెస్టు చేసి వారి నుండి రూ.15,100 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.





250 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - యడ్లపాడు

మండల కేంద్రమైన యడ్లపాడులోని పిఆర్ విజ్ఞాన కేంద్రంలో యడ్లపాడు అభివృద్ధి కమిటీ, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 250 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి రెండు నెలలకు సరిపడ మందులు పంపిణీ చేశారు. డాక్టర్ లింగమల్లు మోహన్ భాస్కర్‌రావు నేతృత్వంలో జూనియర్ డాక్టర్లు గుంటుపల్లి భవ్యతేజ, సొంటినేని నవ్య శ్రీ పరీక్షలు చేశారు. చెన్నుపాటి పూర్ణచంద్రరావు టిఫిన్ ఏర్పాట్లు చేయగా, గోగులమూడికి చెందిన రామినేని విజయ, సుబ్బారావు దంపతులు భోజనాన్ని సమకూర్చారు. యడ్లపాడు అభివృద్ధి కమిటీ సభ్యులు ఎం.రవీంద్రబాబు, కె.రామబ్రహ్మం, పి.శ్రీనివాసరావు, బి.రాజేష్ కుమార్, ఎం.వేణుగోపాల్, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్ సభ్యులు ఎస్.శ్రీనివాసరావు, ఆర్.సుమన్, కె.రామోజీరావు, సిహెచ్ రంగారావు, ఆర్.సురేష్ పాల్గొన్నారు.



డీఎస్పీని సత్కరించి జ్ఞాపిక అందిస్తున్న నాగసరపు సుబ్బరాయ గుప్తా, కుమారులు

డీఎస్పీని సత్కరించిన సుబ్బరాయగుప్తా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట డీఎస్పిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కె.నాగేశ్వరరావును నరసరావుపేట మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త, కుమారులు రూపేష్ గుప్తా, రాందేవ్ గుప్తాలు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. టిడిపి హయాంలో సుబ్బరాయ గుప్త నరసరావుపేట మున్సిపల్ చైర్మన్‌గా ఉండగా కె.నాగేశ్వరరావు డీఎస్పీగా పనిచేశారు. ఆ సమయంలో సెల్లార్ పార్కింగ్, కల్తీ పాలు, కల్తీ మద్యం, కల్తీ ఎరువులు, పురుగు మందులు వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపారని సుబ్బరాయగుప్త అన్నారు. ప్రస్తుతం నరసరావుపేటలో ట్రాఫిక్ నియంత్రణ, గంజాయి అమ్మకాలు, అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపాలని కోరారు.

లాంచీ స్టేషన్‌కు రూ.70 వేల ఆదాయం

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండను ఆదివారం భారీగా పర్యాటకులు సందర్శించారు. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు వివిధ లాంచీలలో వెళ్లిన పర్యాటకులు కొండలోని మ్యూజియంలో ఉన్న బుద్ధిని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు,9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్తూపం, అశ్వమేధశాల, స్నానాల గట్టు, బోధి వృక్షం చూశారు. అనంతరం పచ్చని కొండల మధ్య ఉన్న అనుపు, యాంపి స్టేడియం, అశ్వమేథ యగ్నశాల, శ్రీరంగనాథస్వామి దేవాలయం, తదనంతరం 60 అడుగుల ఎత్తునుండి జాలువారే ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు. భారీగా పర్యాటకులు నాగార్జున కొండను సందర్శించడంతో లాంచీల ద్వారా 70,000 రూపాయల ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.



రొంపిచర్ల మండలం సంతగుడిపాడు గ్రామంలో వర్షాలకు దెబ్బ తిన్న మినుము



నరసరావుపేట మండలం ఇక్కుర్రు గ్రామంలో పండాకు తెగులు సోకిన పెసర

పెసర, మినుముకు పండాకు తెగుళ్లు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలో సాగుచేసిన పెసర, మినుము పైర్లకు పండాకు తెగుళ్ల సోకడంతో దిగుబడులు తగ్గి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వానాకాలం పంట సాగులో భాగంగా మండలంలో రైతులు ఈ పైర్లు సాగు చేశారు. ఇటీవల ఎడతెరిపి లేని వానలకు పూత దశలో ఉన్న మినుము, పెసరకు పండాకు తెగుళ్ల సోకి పూర్తిగా దెబ్బతింటున్నాయని రైతులు చెబుతున్నారు. 20 రోజుల క్రితం వానలకు పొలాల్లో నీరు నిలిచి పల్లపు నేలల్లో పూర్తిగా పండాకు తెగులు సోకగా మేరక పొలాల్లో ఒక మోస్తరుగా దెబ్బతిన్నాయి. విత్తనాలు, ఇతర ఖర్చులు కలిపి ఎకరాకు రూ.18 వేలు వరకు పెట్టుబడులు పెట్టామని, తెగుళ్ల ప్రభావంతో దిగుబడులు పూర్తిగా పడిపోయి పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదనకు గురవుతున్నారు.

పల్నాడు జిల్లాలో తొలకరి వర్షాలకు 87,500 ఎకరాలకుపైగా పెసర, మినుము, సోయా, కంది పైర్లు సాగయ్యాయి. ఈ పైర్లకు దాదాపు 15-20 రోజులకు ఒకసారి పూతలో పురుగు, తెగుళ్ల మందు తప్పనిసరిగా పిచికారి చేయాల్సి ఉండగా అల్పపీడన ప్రభావం మూలంగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఆయా పంటలకు మందులు పిచికారీ చేయలేక పోయారు. ఈ నేపథ్యంలో వ్యవసాయాధికారులు పైర్లను పరిశీలించి తెగుళ్ల నివారణకు తగిన సూచనలివ్వాలని రైతులు కోరుతున్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తదితరులు

శాస్త్రీయ భావాలను మరింత విస్తృతం చేయాలి : ఎమ్మెల్సీ కెఎస్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

జనవిజ్ఞాన వేదిక (జెవివి) పల్నాడు జిల్లా 18వ వార్షిక సమావేశం ఆదివారం స్థానిక సాధినేని చౌదరయ్య పాఠశాలలో జరిగింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రతినిధులు హాజరవగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ జిల్లాల విభజన తర్వాత జనవిజ్ఞాన వేదిక మరింత విస్తృత కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. జనవిజ్ఞాన వేదిక అన్ని వర్గాల ప్రజలకు చేరువగా, వారి భాగస్వామ్యంతో రోజురోజుకూ అభివృద్ధి చెందాలని, ఈ ప్రక్రియలో సంఘం సభ్యులు ముఖ్యపాత్ర పోషించాలని చెప్పారు. జెవివి రాష్ట్ర కార్యదర్శి కుర్రా రామారావు మాట్లాడుతూ శాస్త్రీయ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. జెవివి జిల్లా అధ్యక్షులు డాక్టర్ దార్ల బుజ్జిబాబు మాట్లాడుతూ శాస్త్రీయ ధృక్పథం కలిగిన, సమసమాజం, నవసమాజం నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సాదినేని చౌదరయ్య స్కూల్ డైరెక్టర్ ప్రభాకరరెడ్డి, న్యాయవాది మాదాసు భానుప్రసాద్, సాహితీవేత్త డాక్టర్ పివి సుబ్బారావు, వ్యాపారవేత్త ధూళిపాళ్ల వెంకటరావు, ఉపాధ్యాయిని టి.కుమారి తదితరులు మాట్లాడారు.ఈ సందర్భంగా ఐఎఎస్, సివిల్ సర్వీసెస్ ప్రాథమిక అంశాలతో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు రచించిన పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు.



డీఎస్సీ స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మాచర్ల

విద్యార్థులకు, నిరుద్యోగులకు ఎమ్మెల్సీ లక్ష్మణ్‌రావు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు రచించబడిన 125 పేజీల విద్యామ నోవిజ్ఞాన శాస్త్రం స్టడీ మెటీరియల్‌ను ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి తన నివాసంలో ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. టెట్, డీఎస్సీ అభ్యర్థులకు ఈ మెటీరియల్‌ను అందిస్తున్న దృష్ట్యా వారు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరిస్తామని, ఉపాధ్యాయులకు ఉద్యోగులకు అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మాచర్ల అధ్యక్షులు కె.శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి కె.కేశవరెడ్డి, జిల్లా కార్యదర్శులు ఎ.నాసర్‌రెడ్డి, షేక్ ఆయేషా సుల్తానా, సీనియర్ నాయకులు షేక్ గాలిబ్, పి.పట్టాభిరామారావు, నాగరాజు, బి.శ్రీనివాసరావు, శాంతాబాయి, చౌక్లా నాయక్, శంకర్ నాయక్, బాలాజీ నాయక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అవ్వారు ప్రసాదరావు

టిడిపి హామీ మేరకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - అమరావతి

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల అమలుకు అడ్డంకిగా ఉన్న మెమో 1214ను రద్దుచేసి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం తోడ్పడాలని భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంఘం (సిఐటియు) పల్నాడు జిల్లా అధ్యక్షులు అవ్వరు ప్రసాదరావు, కార్యదర్శి సిలార్ మసూద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రమైన అమరావతిలోని సిఐటియు కార్యాలయంలో మండల తాపీ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు, సిలార్ మసూద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం భవనం నిర్మాణ కార్మికులకు తీవ్రమైన అన్యాయం చేసిందని విమర్శించారు. ఇసుక లేకుండా ఏళ్ల తరబడి ఉపాధిని దూరం చేసిందని, ఆ సమయంలో అనేక మంది కార్మికులు ఇళ్లు గడవక ఆకలిచావులకు, అప్పులపాలై ఆత్మహత్యలకు గురయ్యారని తెలిపారు. కరోనా కాలంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలనూ ఆదుకోలేదన్నారు. వీటితోపాటు భవన నిర్మాణ కార్మికులు సహజ ప్రమాద మరణాల్లో చనిపోతే వారి కుటుంబాలకు ఇచ్చే పరిహారం, ప్రసవించిన వారికి ఇచ్చే నగదు సాయం, పెళ్లిళ్లు చేసుకున్న వారికి ఇచ్చే ఆర్థిక సాయం తదితర 12 రకాల సంక్షేమ పథకాలను భవన నిర్మాణ కార్మికులకు రాకుండా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీవ్రమైన అన్యాయం చేసిందని చెప్పారు. భవన నిర్మాణ కార్మికులందరికీ సంక్షేమ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు అందజేస్తామని ఇటీవల ఎన్నికలప్పుడు టిడిపి హామీనిచ్చిందని గుర్తు చేశారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, అందుకు అనుగుణంగా సత్వరమే చర్యలు చేపట్టాలని కోరారు. వీటితోపాటు 60 ఏళ్లు నిండిన భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా పింఛను, వికలాంగులైన వారికి వైకల్య పింఛను, కార్మికుల పిల్లల చదువులను ప్రోత్సహించడానికి స్కాలర్‌షిప్‌లు, తదితర సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న కార్మికుల క్లెయిములను సత్వరమే పరిష్కరించడం ద్వారా ఆ కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి బి.సూరిబాబు, నాయకులు సయ్యద్ మొహిద్దీన్‌వలి పాల్గొన్నారు.

రాజధానిలో విస్తరిస్తోన్న వ్యాపార రంగం

ప్రధాన రహదారుల పక్క స్థలాలకు డిమాండ్

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో వ్యాపార రంగం క్రమేపీ విస్తరిస్తోంది. చిన్న చిన్న వ్యాపార దుకాణాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. స్టానికులే కాకుండా ఇతర ప్రాంతాలకు చెందినవారు రాజధానిలో వ్యాపారాలకు పెట్టుబడి పెడుతున్నారు. మందడం, వెలగపూడి, రాయపూడి, తుళ్లూరు తదితర గ్రామాల్లో ప్రధాన రహదారిపై ఇరుపక్కలా కొత్తగా దుకాణాలు వెలుస్తున్నాయి. కూరగాయల మార్కెట్లు, ఫ్యాన్సీ స్టోర్స్, టీ కొట్లు, రియల్ ఎస్టేట్ కార్యాలయాలు పెద్ద సంఖ్యలో కనిపిస్తున్నాయి. ప్రధాన రహదారుల పక్కన కొత్తగా పెద్ద సంఖ్యలో వ్యాపార దుకాణాలు వెలుస్తున్నాయి. ఎక్కువ అద్దె చెల్లించి మరీ వ్యాపార దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. రోడ్డు పక్కన సింగిల్ రూం కి రూ .10 నుంచి 15 వేల వరకు నెల అద్దె చెల్లిస్తున్నారు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో ప్రధాన రహదారి పక్కన 'టీ' కొట్టు పెటుకోవడానికి ఓ వ్యక్తి రూ .15 వేలు చెల్లించాడు. వైసిపి

'రాజధాని గ్రామాల్లో ప్రధాన రహదారి పక్కన కొద్దిపాటి సొంత స్థలం ఉంటే చాలు.. నెల నెలా అద్దె రూపంలో కొంత సొమ్ము వచ్చేస్తోంది. నిన్న మొన్నటివరకు ఎవరూ పట్టించుకోకపోవడంతో పిచ్చి కంపతో కనిపించిన స్థలాలు ఇప్పుడు రాత్రికి రాత్రి వ్యాపార దుకాణాలుగా మారుతున్నాయి. రాజధాని నిర్మాణ పనులు మొదలయ్యే వరకు వేచిచూడకుండా పెద్ద మొత్తంలో అద్దెలు చెల్లించి వ్యాపారాలు మొదలుపెడుతున్నారు...'

ప్రభుత్వంలో అప్పటివరకూ ఉన్న చిన్నా చితకా వ్యాపార దుకాణాలు మూతబడ్డాయి. 2015-17 మధ్యలో టిడిపి హయాంలో సచివాలయంకు కూతవేటు దూరంలో ఉన్న మందడం, వెలగపూడి గ్రామాల్లో పట్టణాల తరహాలో భారీ హంగులతో హోటళ్లు వెలిశాయి. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఒకటీ అరా తప్ప దాదాపుగా అన్ని మూతబడ్డాయి. వైసిపి ప్రభుత్వం మూడు రాజధానులు ప్రకటన, రాజధానిలో నిర్మాణాలన్నీ అర్ధాంతరంగా నిలిచిపోవడంతో వ్యాపారస్తులు నష్టపోయారు. వ్యాపారాలు బాగా దెబ్బతినడంతో హోటళ్లు, భారీ దుకాణాల యజమానులు కూడా మూటా ముల్లె సర్దుకోవాల్చి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వ్యాపారాలు ఆపేసి వెళ్లిపోయిన కొంతమంది మళ్ళీ రాజధాని మార్గం పడుతున్నారు. రాజధాని గ్రామాల్లో రోడ్డు పక్కన ఇప్పటివరకు నిరుపయోగంగా ఉన్న స్థలాలకు డిమాండ్ ఏర్పడింది. స్థల యజమానులు కొద్దిపాటి స్థలంలో షెడ్ల తరహాలో నిర్మాణాలు చేసి వ్యాపారులకు అద్దెలకు ఇస్తున్నారు. కొంతమంది ఇంటి నిర్మాణాలను ఆదాయ మార్గాలుగా మార్చుకుంటున్నారు. నాలుగు అంతస్తులలో భవనం నిర్మిస్తూ కింద వాహనాల పార్కింగ్ కోసం, వ్యాపారస్తులకు అద్దె కివ్వడమో, లేదా సొంతంగా తామే వ్యాపారం ప్రారంభించడమో చేయాలన్న ఉద్దేశంతో నిర్మాణాలు చేస్తున్నారు. మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరి నారాయణ రాజధాని నిర్మాణ పనులు డిసెంబర్ నుంచి మొదలవుతాయని ప్రకటించిన నేపథ్యంలో రాజధాని గ్రామాల్లో వ్యాపార రంగం రానున్న రోజుల్లో మరింత విస్తరించే అవకాశం ఉంది.



తుళ్లూరులో ప్రధాన రహదారి పక్కన వ్యాపారానికి సిద్ధం చేసిన షాపు





రాజధాని ప్రాంతం తుళ్లూరులో ప్రధాన రహదారి పక్కన ఏర్పాటైన దుకాణాలు, పధాన రహదారి పక్కన ఖాళీ స్థలంలో నిర్మాణం

కొత్త క్రిమినల్ చట్టాలతో ప్రజాస్వామ్యానికి చేటు

ప్రజాశక్తి-తాడేపల్లి

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలు ప్రజాస్వామ్యానికి చేటని ప్రముఖ న్యాయవాది, ఆలిండియా బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్ అన్నారు. అమరావతి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో కొత్త క్రిమినల్ చట్టాలు ప్రజలకు వరమా... శాపమా అనే అంశంపై తాడేపల్లిలోని అమరావతి ఐకాన్‌లో ఆదివారం ఓలేటి స్వాములు అధ్యక్షతన అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంప్రసాద్ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన హక్కులు కాలరాయడానికి, ప్రజల కోసం పని చేస్తున్న ఉద్యమాలను అణిచివేయడానికి కొత్త చట్టాలను కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందని వివరించారు. హక్కుల కార్యకర్తలు, సమాజంలో 70 శాతంగా ఉన్న పేద ప్రజల హక్కుల కోసం పోరాడుతున్న శక్తులను అణిచివేయడానికి ఉపా లాంటి చట్టాలను తీసుకురావడం దుర్మార్గమన్నారు. కాలం చెల్లిన వలస పాలకుల చట్టాలను రద్దు చేసి నూతన చట్టాలను తీసుకొచ్చామని కేంద్ర ప్రభుత్వం చెబుతోందన్నారు. వాస్తవానికి నూతన చట్టాలలో పాత చట్టాలనే 90 నుంచి 95 శాతం చేర్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టాల పేర్లు, సెక్షన్లు, చాప్టర్లు మార్చారని, చేసిన కొద్దిపాటి మార్పులు రాజ్యాంగ విరుద్ధంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేవిగా ఉన్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాల ద్వారా న్యాయవ్యవస్థ అధికారాలు తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు.





అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సుంకర రాజేంద్రప్రాద్, స్టడీసర్కిల్‌కు హాజరైన

పార్లమెంట్లో ఏమాత్రం చర్చ లేకుండా ఈ చట్టాలను తీసుకొచ్చారని, బ్రిటీష్ వలస పాలకులు కూడా చేయని దుర్మార్గమైన చట్టాలను చేశారని విమర్శించారు. ఒక వ్యక్తి మీద పోలీసులు ఎలాంటి కేసులైనా నమోదు చేసే అధికారాన్ని ఈ చట్టాలు కల్పిస్తున్నాయని వివరించారు. కేసు నమోదు చేయబడిన వ్యక్తి తాను చేసింది నేరమో కాదో ఆయనే నిరూపించుకోవాల్సిన దుర్మార్గమైన సెక్షన్లు పొందుపరిచారని చెప్పారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో తీసుకురావడానికి ప్రయత్నించిన ఈ చట్టాలను ప్రజా మద్దతుతో తిప్పికొట్టగలిగామని చెప్పారు. ప్రస్తుతం అవే చట్టాలను పార్లమెంట్‌లో ప్రతిపక్షం లేకుండా సభలో మెజార్టీ ఉందని నియంతృత్వంగా బిజెపి కొత్త చట్టాలను తీసుకొచ్చిందని అభ్యంతరం వ్యక్తం చేశారు. సమాజ చైతన్యం ద్వారానే వరకట్న వేధింపులు తదితర చట్టాలు వచ్చిన సంగతిని గుర్తు చేశారు. పౌర సమాజం కూడా మాకెందుకులే అనుకుంటే పాలకులు ఇటువంటి చట్టాలనే తీసుకొస్తారని విమర్శించారు. కొత్త చట్టాల వల్ల ప్రశ్నించే వక్తులనే కాకుండా వారి కుటుంబ సభ్యులను కూడా ఇరికించే అవకాశం ఉందన్నారు. పౌర సమాజం వీటిని తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ముందుగా వక్తలను అమరావతి స్టడీ సర్కిల్ నిర్వాహకులు ఎస్.వెంకట్రావు వేదిక మీదకు ఆహ్వానించారు. వందన సమర్పణ విజ్ఞాన కేంద్రాల రాష్ట్ర బాధ్యులు పిన్నమనేని మురళీకృష్ణ చేశారు.

కలకత్తా ఘనటనపై ముఠాకార్మికుల నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

కలకత్తా ఘటనను నిరసిస్తూ టింబర్ ముఠా వర్కర్స్ (సిఐటియు) ఆధ్వర్యంలో కడప అడితీల వద్ద నుండి నల్లచెరువు ఎత్తు రోడ్డు వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఠా వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ మాట్లాడుతూ వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళలపై పలు చోట్ల జరుగుతున్న అఘాయిత్యాలు, 'ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కోట్లాది మంది మహిళలు పని చేస్తున్నారని యాజమాన్యాల ఒత్తిడి మేరకు, రాత్రి వేళల్లోనూ మహిళలు పనిచేయాలని కూడా మహిళలు పని చేయాలని చట్టాలు తెచ్చారన్నారు. కానీ వారి రక్షణకు ఎటువంటి నిర్దిష్టమైన చర్యలు తీసుకోవట్లేదన్నారు. చట్టాలను అమలు చేస్తున్న తీరు అత్యంత ఘోరంగా ఉందన్నారు. కార్మిక మంత్రిత్వ శాఖ వైఖరి నిర్లక్ష్యంగా ఉందన్నారు. కలకత్తాలో ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం చేసి ఆమెను హత్య చేసిన ఘటన దేశ ప్రజలను నిర్ఘాంత పరిచింది అన్నారు. దుర్మార్గమైన, హేయమైన ఈ చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలన్నీ మహిళలకు తమ పని ప్రదేశాల్లో భద్రత కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, సుప్రీంకోర్టు చేసిన సూచనలను పాటించాలని లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో టింబర్ ముఠా యూనియన్ ప్రెసిడెంట్ ఎస్.కె.జిలాని, ఐద్వా నగర కార్యదర్శి ఎ.కళ్యాణి, డివైఎఫ్ఐ నగర నాయకులు ఎస్.కార్తీక్ తదితరులు ప్రసంగించగా, సిఐటియు తూర్పు కమిటీ ఉపాధ్యక్షులు టి.శ్రీనివాసరావు, ముఠా కార్మికులు బండి వెంకటేశ్వర్లు, ఎస్ కె.వలి, జానీ, బాజీ, చిరంజీవి, పీర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



స్కాలర్‌షిప్‌లు అందచేస్తున్న ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్

అవోపా ఆధ్వర్యంలో రూ.30 లక్షలు స్కాలర్‌షిప్‌లు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ఆవోప ఎడ్యుకేషనల్ ట్రస్టు ద్వారా ప్రతిభ కలిగిన 220 మంది పేద విద్యార్థులకు రూ.30 లక్షలు స్కాలర్షిప్పులు అందచేశారు. స్థానిక వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు తటవర్తి రాంబాబు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ హాజరై విచ్చేసి స్కాలర్షిప్‌లు పంపిణీ చేశారు.ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ మాట్లాడుతూ దానధర్మాలు చేయడానికి ఆర్యవైశ్యులు ముందుంటారని, పేదరికం వల్ల చదువు ఆగిపోకూడదని, సేవా సంస్థలు అందించే సహాయము ద్వారా ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడాలన్నారు. ఉన్నత స్థాయికి చేరిన తర్వాత పేదవారికి సహాయము చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వారికి నచ్చిన రంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. క్రేన్ సంస్థల అధినేత గ్రంధి కాంతారావు మాట్లాడుతూ జీవితంలో తల్లి తండ్రి గురువు దైవాన్ని మరిచిపోకూడదన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాలను కొనసాగించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. క్రమశిక్షణతో చదివి ఉద్యోగాలకు పరిమితం కాకుండా, పది మందికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలన్నారు. తట్టపర్తి రాంబాబు మాట్లాడుతూ సంవత్సరం రూ.30 లక్షలు ఉపకారవేతనాలు దాతల సహాయ సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. అవోప గుంటూరు నగర అధ్యక్షులు కె.వి.బ్రాహ్మం మాట్లాడుతూ సమాజానికి కావాల్సిన విద్య, వైద్యం, ఉపాధి ఈ మూడింటికీ అవోపా ద్వారా సహాయ సహకారములు అందిస్తున్నట్లు తెలిపినారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, నాగేశ్వరరావు మహిళా విభాగం చైర్మన్ నిర్మల, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, రాధాకృష్ణయ్య ట్రెజరర్ మహంకాళి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు



స్కాలర్‌షిప్‌లు అందచేస్తున్న ఎమ్మెల్యే నసీర్

వెంకటరత్నం, నాగమ్మ వారసుల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-గుంటూరు

దశాబ్దాల క్రితం తమ తల్లిదండ్రులు ప్రభుత్వ ఆసుపత్రి రోగుల కోసం సత్రాన్ని అందించారని వారి వారసులు, వారి వారసత్వాన్ని కొనసాగిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ అన్నారు. స్థానిక సాంబశివపేట ఒకటో లైన్ చుండూరు వెంకటరత్నం నాగమ్మ నాగరత్నం సత్రంలో ట్రస్టీల ఆధ్వర్యంలో చుండూరు సుబ్బారావు చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు నోటు పుస్తకాలు పెన్నులు స్కాలర్షిపులు మహిళలకు చీరలు వద్ధులకు దుప్పట్లో పేదలకు అన్నదానం పెద్ద ఎత్తున నిర్వహించారు. మనుమడు చుండూరు దామోదర్‌రావు మాట్లాడుతూ తమ తాతయ్య నాయనమ్మలు తొలినాళలో చలివేంద్రాలు నిర్వహించి తదనంతరం 1965లో సత్రాన్ని నిర్మించి వందలాది మందికి ఆశ్రయం కల్పించారన్నారు. కార్యక్రమంలో ఫ్యాన్సీ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు జుజ్జూరు శేషప్రభాకరరావు, కార్యదర్శి రంగారామకష్ణ, ఆలమూరు విజయలక్ష్మి, కొనగళ్ళ సత్యం, కోట శేషగిరి, ఇండియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ మల్లేశ్వరరావు, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి.అనుపమ తదితరులు పాల్గొన్నారు.



టిడిపి పశంసాపత్రాన్ని అందజేసి చూస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

కష్టపడే కార్యకర్తకు టిడిపిలో గుర్తింపు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

కష్టపడే ప్రతి కార్యకర్తకూ టిడిపిలో గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి అంకితభావంతో పనిచేసిన టిడిపి నాయకులు, కార్యకర్తలను అభినందిస్తూ సీఎం చంద్రబాబు సంతకంతో ప్రశంసాపత్రాలు వచ్చాయి. వీటిని తన నివాసంలో నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే అందజేసి అభినందించారు. టిడిపి యాప్ ద్వారా పార్టీ కంటెంట్‌ను షేర్ చేసి టాప్ పెర్ఫార్మర్లుగా నిలిచివారిలో చిలకలూరిపేట నియోజకవర్గంలో పదిగురు నిలిచారు. వారికి అభినందన ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలో టిడిపి తిరుగులేని శక్తిగా ఎదుగుతోందన్నారు. ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రణాళికలను ప్రజలకు చేరువ చేసేందుకు 'మన టిడిపి యాప్'ను విస్తృతంగా వినియోగించాలని వారిని సూచించారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు

ప్రజాశక్తి-మాచర్ల రూరల్

మాచర్ల పట్టణంలోని 23వ వార్డులో ఘనంగా బోనాల ఉత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. దీనికి మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు, రాష్ట్ర యువత కార్యదర్శి కొమెర శివ, ప్రధాన కార్యదర్శి బండ్ల శ్రీనివాసరావు, మంజుల పెద్ద అంజి, కొమెర అనంతరములు, కొమెర శీను, బత్తుల కుమార్, ఉప్పుతోళ్ళ దుర్గారావు, డేరంగుల వెంకటేష్, కొమెర సాంబ, కొట్టు వేంకటేశ్వర్లు, ఉప్పుతోల్ల ఏడుకొండలు, డేరంగుల కాశయ్య, చల్లా వెంకటేశ్వర్లు, చల్లా హరి, బత్తుల సైదులు, మంజుల వెంకట్రావు, మంజుల మహేష్, మంజుల అంజి, మంజుల శ్రీను, మంజుల లింగయ్య, మంజుల మార్కొండ, కొమెర నాగేశ్వరరావు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

మాజీ సిఎం బిపి.మండల్ జన్మదిన వేడుక

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

మాజీ ముఖ్యమంత్రి బిపి మండల్ 106వ జయంతి వేడుకలు బీసీ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘ నేతలు మాట్లాడుతూ దేశంలో 52శాతం ఉన్న బీసీలకు విద్యా, ఉద్యోగ రంగాలలో సమాన వాటకోసం విశేష కృషి చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. మహాత్మా జ్యోతిరామ్ పూలే, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆశయా సాధనకు కట్టుబడిన మహోన్నత వ్యక్తి బిందేశ్వర్ మండల్ ప్రసాద్ అని కొనియాడారు. అనంతరం స్థానిక ఎన్‌జిఒ సెంటర్‌లో బిపి మండల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కె.వెంకటరామయ్య, పి.హరేకష్ణ, కుమ్మరి దస్తగిరి, పీక్కిలి శివ, గుంటూరు గోవిందు, గుంజి విజయ్‌కుమార్, అమరేశ్వరావు, కోటేశ్వరరావు, షేక్ చిన షరీఫ్ పాల్గొన్నారు.



బిపి.మండల్ పటం వద్ద నివాళులు అర్పిస్తున్న బిసి నేతలు

ప్రభుత్వ కార్యాలయాలు కావలెను..!

గాడి తప్పుతున్న అభివృద్ధి పనులు
ప్రజలకు తప్పని తిప్పలు
పట్టించుకోని ఉన్నతాధికారులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ప్రజాస్వామ్యంలో పాలకులను ప్రజలు ఎన్నుకుంటారు. వారి బాగోగులను, సౌకర్యాలను, అభివృద్ధిని కాంక్షించి సేవలందించే బాధ్యత పాలకులది. ప్రభుత్వాన్ని నడిపే పాలకులది యంత్రాంగ నిర్మాణంలో ముఖ్యపాత్ర ఉంటుంది. ఏ పథకం ప్రజలకు చేరాలన్నా క్షేత్రస్థాయిలో అధికారులదే ప్రథమస్థానం. అలాంటి అధికారులను నియమించడంలో ప్రభుత్వం విఫలమైతే అభివృద్ధి కానరాకపోతుంది. పెన్షన్ల పంపిణీ నుండి భారీ ప్రాజెక్టుల నిర్మా ణం వరకు అధికారుల పాత్ర కీలమైనది. అటువంటి అధికారుల కొరత చిలుకలూరిపేట నియోజకవర్గంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కొన్ని కార్యాలయ విభాగాల్లో అధికారులు లేక వెలవెలబోతున్నాయి. మరి కొన్ని ఆఫీసుల్లో ఖాళీ పోస్టులు వెక్కిరిస్తున్నాయి. కొన్నైతే ఏకంగా వేరే ప్రాంతాలకు తరలిపోయాయి. ఇలా ఉంటే అభివృద్ధి ఎలా?

తరలిన ఆఫీసులు, అధికారులు

చిలకలూరిపేట పట్టణంలో 80 వేలకుపైగా జనాభా ఉన్నారు. మండల పరిధిలో 23 గ్రామ పంచాయలున్నాయి. నియోజకవర్గంలోని యడ్లపాడు, నాదెండ్ల మండలాలు కలిపి 56 గ్రామ పంచాయతీల్లో సుమారుగా 2.40 లక్షలకుపైగా జనాభా ఉన్నారు. నిన్న మొన్నటి దాకా అన్ని రకాల ప్రభుత్వ కార్యాలయాలున్నా కొద్ది నెలల కిందట ఇతర నియోజకవర్గాలకు తరలివెళ్లాయి. గతంలో ఇక్కడ పనిచేసిన కొంత మంది అధికారులు జిల్లా కేంద్రంలో పని చేస్తున్నారు.

అధికారుల కొరత

తహశీల్దార్ కార్యాలయంలో సివిల్‌సప్లై అధికారి స్థానాన్ని భర్తీ చేయాల్సి ఉంది. అయితే నరసరావుపేట నుంచి మరో అధికారి ఇన్‌ఛార్జి బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయంలో ప్లానింగ్ డివిజన్ అధికారులు లేకపోవడంతో స్థలాల ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఎంఈఓ కార్యాలయంలో రెండో అధికారి స్థానం భర్తీ చేయాల్సి ఉంది.





మూసివేతకు గురైన కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయం.. అధికారులు లేకుండా పాతభవనంలో కొనసాగుతున్న ఎపిఎస్ఐసిడి కార్యాలయం

రోడ్లు-భవనాల శాఖ కార్యాలయంలో రెండున్నరేళ్లుగా ఎఇలు లేరు. డిప్యూటేషన్‌పై నకరికల్లు నుంచి ఒక అధికారు, ఎడ్లపాడు నుంచి ఒక అధికారి విధులు నిర్వహిస్తున్నారు. ఇలా అధికారులు లేకపోవడంతో పలు ప్రభుత్వ పనులు ప్రజల చెంత చేరడం లేదని ప్రజలు వాపోతున్నారు.

ప్రజలకు తప్పని తిప్పలు

పట్టణ శివారు సింగ్‌నగర్ నుంచి ఈటి(కోటప్పకొండ) వరకు రోడ్లు సక్రమంగా గుంతలకు నిలయంగా మారుతోంది. దీనివల్ల అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆ రోడ్లపై కూలి పనులకెళ్తూ ట్రాక్టర్‌పై నుంచి కింద పడి నుండి ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. చిలకూరిపేట నుండి నాదెండ్ల వెళ్లే మార్గం కూడా ఇదే తరహాలో ఉంటోంది. ఈ రెండు రోడ్లకు నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా పనులు లేకపోవడం శోచనీయం. సిబ్బంది లేమీ దీనికి కారణంగా తెలుస్తోంది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు (ఎన్‌ఎస్‌పి) కెనాల్ కార్యాలయంలో అధికారులు లేక చీరాల నుంచి డ్రెయినేజీ శాఖాధికారులే అదనంగా విధులు నిర్వహిస్తున్నారు. రైతులకు ఏదైనా అవసరం ఉంటే నరసరావుపేట వెళ్లాలో? చీరాల వెళ్లాలో అర్థం కాకపోతున్నారు. రూ.8 కోట్ల మిగులు ఆదాయం ఉన్న కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయాన్ని రూ.రెండు కోట్లు తరగు ఆదాయంలో ఉన్న సత్తెనపల్లి కార్యాలయలో విలీనం చేశారు. ఈ శాఖకు సంబంధించి చిన్న పని ఉన్నా సత్తెనపల్లి పోవాల్సి వస్తోందని, అదనపు ఖర్చులతో పాటు మధ్యవర్తులకు అదనంగా చెల్లించుకోవాల్సి వస్తోందని వ్యాపారులు, ప్రజలు వాపోతున్నారు.

పట్టించుకోని ఉన్నతాధికారులు

డ్రెయినేజీ కార్యాలయం లేక పోవటంతో వాగులు, కాల్వలు, చెరువులకు నీటి పారుదల సౌకర్యం సరిగా లేక ఎత్తిపోతల పథకాలు పని చేయడం లేదు. వందలాది ఎకరాలకు కనీసం ఆరుతడి పంటల సాగుకైనా నీరందడం కష్టమవుతోంది. ఎక్సైజ్ శాఖ కార్యాలయం లేక మద్యం తనిఖీలు చేయాలన్నా, అక్రమ మద్యాన్ని పట్టుకోవాలన్నా నరసరావుపేట నుంచి అధికారులు రావాల్సి వస్తోంది. మెడికల్ తనిఖీ అధికారి కార్యాలయం లేని కారణంగా విచ్చలవిడిగా అదనపు ధరలు వసూలు చేస్తున్నారు. ఇక్కడి నుండి నకిలీ ఓజోమెన్ టాబ్లెట్లు తూర్పుగోదావరి జిల్లాకూ సరఫరా చేస్తున్నారనే అరోపణలు ఉన్నాయి. ఆహార తనిఖీ కార్యాలయం లేకపోవటంతో కల్తీ ఆహార పదార్థాలపై చర్యలు తీసుకునే వారే కరువయ్యారు. కార్మిక శాఖాధికారి కార్యా లయం ఉన్నా నిర్వహణ మాత్రం శూన్యంగా కని పిస్తోంది. ఎపిఎస్ఐడిసి కార్యాలయాన్ని పట్టనానికి వెలుపల పాములు తిరిగే పాత ఇంట్లో అద్దెకు నిర్వహి స్తున్నారు. అధికారులు సైతం ఉండడం లేదు. అగ్నిమాపక కార్యాలయంలో సగానికిపైగా సిబ్బంది కొరత ఉంటోంది. ఉన్న సిబ్బందిపైనే పనిభారం పడడంతోపాటు కార్యాలయ నిర్వహణలో లోపాల కారణంగా ప్రమాదాలు జరిగినప్పుడు అదుపు చేయడానికి నానా అవస్థ పడుతున్నారు. వ్యాపార, పారిశ్రామిక ప్రాంతమైన చిలకలూరిపేటలో ప్రధాన కార్యాలయాలు, వాటికి సరిపడా అధికారులను నియమించి మేలైన సేవలు అందించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పి.శివరామకృష్ణ

హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని బీసీ బాలుర వసతిగృహంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించినట్లు హెల్ప్ ఫౌండేషన్ అధ్యక్షులు కె.బుల్లిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా దంత వైద్యులు పి.శివరామకృష్ణ మాట్లాడుతూ దంతాల పట్ల విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విధిగా విద్యార్థులు రెండు పూటల బ్రష్ చేయాలన్నారు. ప్రతి దంత సంరక్షణా వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవాలన్నారు. దంత సంరక్షణతోనే ఆరోగ్యం దాగి ఉందన్నారు. చెడు అలవాట్లతో దంతాలను పాడుచేసుకోవద్దని హితవు పలికారు. విద్యార్థుల కోసం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసిన హెల్ప్ ఫౌండేషన్ నిర్వాహకులను హాస్టల్ వార్డెన్ రత్నబాబు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి టూత్ పేస్ట్, బ్రష్‌లను అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అంజి, నారాయణ పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి రూ 54.34 కోట్ల రుణాలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మహిళా సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని నరసరావుపేట ఎంపి లావు శ్రీకష్ణ దేవరాయలు అన్నారు. మహారాష్ట్ర లోని జలగాంలో ప్రధాని నరేంద్ర మోడి లక్‌పతి దీదీ పథకాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. దీనిని కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎంపి లావు శ్రీకష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు వివిధ శాఖల జిల్లా అధికారులు వీక్షించారు. 5,184 మంది మహిళలకు ప్రశంసాపత్రాలు, సిఐఎఫ్ ఋణాలు రూ.20లక్షలు, బ్యాంక్ లింకేజీ ఋణాలు రూ.54.14 కోట్లు చెక్కులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా 2023లో కేంద్రం ప్రారంభించిన ఈ పథకాన్ని కేంద్రగ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ పటిష్టంగా అమలు చేస్తుందన్నారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో మహిళకు లబ్ది చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి బాలు నాయక్, లక్‌పతి దీదీలు, సిఆర్‌పిలు, మహిళలు పాల్గొన్నారు.



మెగా చెక్కు ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపి

గ్రామ కంఠాల సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని గ్రామాల్లో గ్రామకంఠాల అంశం పై చర్చలు సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం తో గ్రామ కంఠాల వ్యవహారం ముందుకొచ్చింది. కూటమి ప్రభుత్వం గ్రామ కంఠాల సమస్యను పారదర్శకంగా పరిష్కరించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఊరిలో ఉమ్మడి అవసరాలకోసం కేటాయించే భూములను గ్రామ కంఠాలుగా వ్యవహరిస్తారనే సంగతి తెలిసిందే. రాజధాని ప్రకటన అనంతరం 2014 - 17 మధ్య టిడిపి ప్రభుత్వం ఊరికి 500 మీటర్ల దూరంలోపు ఉన్న భూములను నివాస స్థలాలుగా గుర్తిస్తామని పేర్కొంది. అయితే ఆచరణలో కొందరికి మాత్రమే గ్రామకంఠాల వ్యవహారంలో మేలు కలిగేలా వ్యవహరించిందని కొందరు రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు. విలేజ్ రెసిడెన్షియల్ జోన్ అనేది 2008లో రాజపత్రం 333 ద్వారా, జీవో నెంబర్385 ద్వారా నిర్ణయించబడి ఆమోదం పొందిందని, అమరావతి రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని 2008 జోనల్ డెవలప్మెంట్ ప్లాన్‌కు అనుగుణంగా గ్రామ కంఠాల సమస్యలను పరిష్కరించాలని రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు ఈ నెల 20 న విజయవాడలోని సి ఆర్‌డీఏ కార్యాలయంలో తుళ్లూరుకు చెందిన రైతు జమ్ముల శ్రీనాథ్, కొంతమంది రైతులు వినతిపత్రం అందజేశారు.

మద్యం కేసులో వంద వాహనాలు సీజ్ : డిఎస్‌పి

ప్రజాశక్తి - మంగళగిరి



మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతూ రోడ్లపైకి రావద్దని నార్త్ సబ్ డివిజన్ డిఎస్పి సిహెచ్ మురళీకృష్ణ సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ రాష్ డ్రైవింగ్ చేసే వారికి గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళగిరి పట్టణంలో ఆరు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి సుమారు వంద వాహనాలను సీజ్ చేశారు. ద్విచక్ర వాహనాలను నడుపుతూ, రోడ్లపైకి వస్తున్న మైనర్లకు, వారి తల్లిదండ్రులకు శనివారం రాత్రి పట్నం పోలీస్ స్టేషన్ ఆవరణలో డిఎస్పి సిహెచ్ మురళీకృష్ణ కౌన్సిలింగ్ ఇచ్చారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపవద్దని సూచించారు. మైనర్లు వాహనాలు నడపటం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతు న్నాయని తెలిపారు. ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబానికి దిక్కు ఎవరని అన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు బైకులు ఇవ్వవద్దని తెలిపారు. పత్రాలు లేకుండా వాహనాలను నడిపితే అనేక ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ సీఐ వినోద్ కుమార్ , పలువురు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

చెవి, ముక్కు, గొంతు సమస్యల పట్ల నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న డాక్టర్ రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు :వృద్ధాప్యంలో చెవి, ముక్కు, గొంతు సమస్యలు అధికం అవుతాయని, వాటిని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని సీనియర్ ఇఎన్‌టి సర్జన్ డాక్టర్ యస్.రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో టివి సాయిరామ్ అధ్యక్షతన నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వినికిడి లోపాలు, చెవిలో హోరు, తల తిరగటం, ముక్కు వెంట రక్తం కారటం, గొంతులో మార్పు లాంటివి సాధారణ ఇఎన్‌టి సమస్యలని చెప్పారు. చెవిలో గుబిలి కట్టడం, చెవి నరాలు దెబ్బతినటం, మధ్యచెవిలో వినికిడి యంత్రాంగం దెబ్బతినటం, లోపలి చెవిలో లోపాలు ఏర్పడటం, కొన్ని గొంతు వ్యాధులు వినికిడి లోపానికి కారణం అవుతాయన్నారు. వినికిడి లోపం ఉన్నప్పుడు ఇఎన్‌టి వైద్యుల్ని సంప్రదించాలన్నారు. వాక్స్ చెవిలో పేరుకుంటే ఇఎన్‌టి సర్జన్ తొలగిస్తారని, చెవి పొరకు కన్నం పడితే దానికి సర్జరీ చేయాల్సి ఉంటుందన్నారు. ముక్కుకు తెలియకుండా దెబ్బతగలటం, ముక్కును గట్టిగా చీదటం, ముక్కులో వేలుతో తిప్పటం లాంటివి చేయటం వల్ల, కొన్ని రకాల ఇన్ఫెక్షన్ల వల్ల కూడా ముక్కువెంట రక్తం కారుతుందన్నారు. సైనోసైటిస్ ఉన్న వారిలో ముక్కులో కేన్సర్ గడ్డలు వచ్చినా, రక్తం కారుతున్నా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. స్వరపేటికలో ఇన్ఫెక్షన్లు వచ్చి, వాపు కలగటం వల్ల గొంతు బొంగురుపోవటం, మాట్లాడలేకపోవటం జరుగుతుందన్నారు. గొంతులో మార్పు వస్తే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. చలిలో, వర్షంలో, దుమ్ములో తిరగటం చేయకూడదని చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ రామచంద్రారెడ్డిని అవగాహన సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు కృష్ణాజీ, శివరామకృష్ణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

బడుగుల నేత బి.పి మండల్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి

నేషనల్ ఓబీసీ కమిషన్ చైర్మన్‌గా దేశంలో 3743 కులాలుగా, జనాభాలో 52 శాతంగా ఓబీసీలు ఉన్నారని, వారికి విద్య-ఉద్యోగ రంగాలలో 27 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రతిపాదించి, బడుగుల జీవితాలలో వెలుగులు నింపిన మహానుభావుడు బీపీ మండల్ అని ఏపీ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ కొనియాడారు. బి.పి మండల్ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో, మండల్ చిత్రపటానికి పలువురు బీసీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహేష్ మాట్లాడుతూ,1979 మురార్జీ ప్రభుత్వం లో రెండవ జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ గా నియమించబడి, దేశవ్యాప్తంగా పర్యటించి ఎంతో క్లిష్టమైన ఓబీసీల జీవన స్థితిగతులను అధ్యయనం చేసి, రెండేళ్ల స్వల్ప వ్యవధిలోనే ఓబీసీల అభ్యున్నతికి, 40 సిఫారసులతో నివేదికను సమర్పించిన గొప్పమేధావి బిపి మండల్ అన్నారు. నివేదికను సమర్పించి 44 ఏళ్లు అవుతున్నప్పటికీ వారు ప్రతిపాదించిన రెండు మూడు సిఫారసులు తప్ప,మిగతావేవి అమలు జరుపబడలేదన్నారు. వారి జయంతి సందర్భంగా ఈనాటి నుండైనా అన్ని సిఫారసులను అమలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని శ్రీ మహేష్ డిమాండ్ చేశారు. ఇంకా ఈ వేడుకలలో రాష్ట్ర యువజన విభాగ కార్యనిర్వాహక



బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు

అధ్యక్షులు యు రాజ్ కిరణ్, గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ కాగితాల స్వాతి గౌడ్, నియోజకవర్గ అధ్యక్షులు వుడతా శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ తిరువీధుల కిరణ్, కాట్రు ధనంజయ్, కొల్లి నాగేంద్ర బాలాజీ, గుంటూరు పట్టణ అధ్యక్షులు కొమ్మాకుల విజయభాస్కర్, దానా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సత్కరించిన ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పెదరావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-2003 పదవతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 20 ఏళ్ల తర్వాత కలిసిన స్నేహితులు ఆత్మీయ ఆలింగనంతో అలనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులను నేర్పించిన గురువులతో కాసేపు ముచ్చటించారు. పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు తల్లం వెంకట సుబ్బారావు, షేక్ అబ్దుల్ సత్తార్, వరికూటి శ్రీనివాసరావులను సన్మానించారు.

స్పీకర్‌తో కన్నా భేటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు ఆదివారం గుంటూరు వచ్చిన సందర్భంగా మాజీ మంత్రి, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ నివాసానికి వచ్చారు. ఇటీవల కన్నా కుడి భుజానికి శస్త్ర చికిత్స చేయించుకున్న నేపథ్యంలో ఆయన్ను పరామర్శించేందుకు అయ్యన్నపాత్రుడు వచ్చారు. స్పీకర్‌కు కన్నా కుమారులు నాగరాజు, రవి ఘన స్వాగతం పలికారు. అయ్యన్నపాత్రుడికి పుష్ప గుచ్ఛం ఇచ్చి కన్నా లక్ష్మీనారాయణ శాలువా తో సత్కరించారు. ఈ సందర్భంగా వీరి మధ్య పలు రాజకీయ అంశాలు చర్చకు వచ్చాయి. కన్నా స్నేహితులు, కుటుంబ సభ్యులతో స్పీకర్ కొద్దిసేపు మాట్లాడారు.



అయ్యన్నపాత్రుడికి స్వాగతం పలుకున్న కన్నా కుమారులు నాగరాజు, రవి

నేటి జిఎంసి గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రతి సోమవారం నిర్వహించాల్సిన గ్రీవెన్స్ శ్రీకృష్ణాష్టమి సెలవు సందర్భంగా నేడు రద్దు చేసినట్లు నగర కమిషనర్ పులి శ్రీనిసవాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

అలరించిన అవగాహన హాస్యవల్లరి

ప్రజాశక్తి-గుంటూరు

కష్టాలను కాసేపు పక్కనబెట్టి హాయిగా నవ్వుకోవడం ఆరోగ్యదాయకమైనందని, హాస్యం దివ్యౌషధమని అవగాహన హాస్యవల్లరి కార్యక్రమంలో పాల్గొన్న హాస్య ప్రియులు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో జరిగిన నవ్వుల విందు అందరినీ అలరింపచేసింది. ఈ కార్యక్రమాన్ని ప్రముఖ మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ పి.వి.రామ్ కుమార్ ప్రారంభించి ప్రసంగించారు. నవ్వు సంస్కారవంతమైన హదయానికి ప్రతీక అని మానసిక రోగులకు దివ్యౌషధమని రామ్‌కుమార్ అన్నారు. కష్టాలను కన్నీళ్లను, పక్కనపెట్టి ప్రతి ఒక్కరూ రోజూ ఒక గంట హాయిగా నవ్వాలన్నారు. సీనియర్ న్యాయవాది గూడవల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ హాస్యం గొప్ప ఔషధంలా పనిచేస్తుందన్నారు. హాస్యవల్లరి కో ఆర్డినేటర్ వి.వి.రావు మాట్లాడుతూ హాస్యం ఇతరులతో కలిసి హాస్యాన్ని పంచుకుంటుంటే ఆ ఆనందం వేరన్నారు.అనంతరం జోక్స్, హాస్య పాటలు, కామెడీ స్కిట్స్‌తో అలరించారు. కార్యక్రమంలో బసవగుప్తా, ఆర్. వెంకటేశ్వరరావు, రమణ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి క్రీడా పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 29న హాకీ మాంత్రికుడు పద్మవిభూషణ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈనెల 26వ తేదీ నుండి 31వ తేదీ వరకూ బిఆర్ స్టేడియంలో వివిధ క్రీడాంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. వాక్‌రేస్, వాలీబాల్, హాకీ, మినీ ఫుట్‌బాల్, టెన్నిస్ బాల్ క్రికెట్, బాడ్మింటన్, చెస్, బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, టగ్ ఆఫ్ వార్, లెమన్ రేస్, రోప్ జంపింగ్, ఖోఖో, లగోరి లంగడి, ప్లాంక్ చాలెంజ్ పోటీలు ఉంటాయన్నారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇస్తామన్నారు. కావున జిల్లాలోని వ్యాయాయ ఉపాధ్యాయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపి, విద్యార్థులను క్రీడలలో పాల్గొనేటట్లు ప్రోత్సహించాలని కోరారు.



మాట్లాడుతున్న డొక్కామాణిక్య వర ప్రసాద్

అనంతబాబును సస్పెండ్ చేయాలి : డొక్కా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబును పదవి నుంచి సస్పెండ్ చేయాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ డిమాండ్ చేశారు. గుంటూరులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారం కోల్పోయినా వైసిపి నేతల్లో మార్పు రాలేదన్నారు. దళిత డ్రైవర్‌ను డోర్ డెలివరి చేసిన అనంతబాబు తాజాగా ఒక అసభ్యకరవీడియోలో ఉండటం దారుణం అన్నారు. వైసిపి ఎమ్మెల్సీ అనంత్ బాబు తన వికత చేష్టలతో అప్రదిష్ట పాలయ్యారని అయినా వైసిపి అధినేత జగన్ పట్టించుకోవడం లేదన్నారు. అనంతబాబును పార్టీ నుండి సస్పెండ్ చేసి వైసిపి పదవి నుంచి తొలగించాలన్నారు. వైసిపి నేతల వికృతచేష్టలు, అరాచకాలపై త్వరలో గవర్నర్‌కు వినతిపత్రం సమర్పిస్తామన్నారు. మరో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. వైసిపి నేతలు అహంకారాన్ని విడనాడి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా రాజకీయాల్లో కొనసాగాలన్నారు.

స్కూల్ గేమ్స్ సెక్రెటరీగా రవి నియామకం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా నూతన స్కూల్ గేమ్స్ సెక్రెటరీగా రేవేంద్రపాడు జెడ్పీ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు మల్లెంపూడి రవి నియమితులయ్యారు. ఈ మేరకు నూతన సెక్రెటరీకి జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ ఆదివారం నియామకపత్రం అందజేశారు. రవి ఈ పదవిలో 2024-25, 2025-26 విద్యా సంవత్సరంలో కొన సాగుతారు. ఈసందర్భంగా డిఇఒ మాట్లాడుతూ గతంలో స్కూల్ గేమ్స్‌లో గుంటూరు జిల్లా జట్లు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నో పతకాలు సాధించాయని, రాబోయే రోజుల్లో కూడా అదే పరంపరను కొనసాగించి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. నూతన ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ రవి మాట్లాడుతూ తన సీనియారిటీని పరిగణలోకి తీసుకుని రాబోయే రెండు సంవత్సరాలకు గుంటూరు జిల్లా ఎస్‌జిఎఫ్ సెక్రెటరీగా నియమించినందుకు డిఇఒకు కతజ్ఞతలు తెలియచేశారు. జిల్లాలో జరిగే క్రీడా కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహించడానికి నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయుల సలహాలు సూచనలను తీసుకుని, సమిష్టి కషితో జిల్లాను క్రీడలలో ముందు వరుసలో నిలబెట్టడానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు వినయ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.వెంకటేశ్వరావు, టి.వెంకటేశ్వరావు, రమేష్, రజిని నాయక్, హరికృష్ణ పాల్గొన్నారు.


రవికి నియామపత్రం అందచేస్తున్న డిఇఒ

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు శ్లాఘనీయం

ప్రజాశక్తి తెనాలి : సామాజిక స్పృహ కలిగిన తెనాలి పట్టణ పరిసర ప్రాంతాలలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవలు వెలకట్టలేనివని తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ అన్నారు. సంస్థ సమావేశం ఆదివారం ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాల లైబ్రరీలో నిర్వహించారు. సంస్థ రీజినల్ ఛైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త కొత్త సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో అమృత సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ కె రామ్మోహన్‌రావు ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కెవి గోపాలకృష్ణను సంస్థ తరపున సత్కరించారు. సన్మాన గ్రహీత గోపాలకృష్ణ మాట్లాడుతూ మేధావులు, విద్యావంతులు, వ్యాపారవేత్తలు సామాజిక దృక్పథంతో ఒక సంస్థను ఏర్పాటు చేసి తద్వారా సమాజంలో అట్టడుగు వర్గాలకు సేవలందించడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని, వీలైతే తనను కూడా సేవా కార్యక్రమాలలో భాగస్వామిని చేయాలని సంస్థను కోరారు. సంస్థ తరపున సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని రీజనల్ ఛైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం వెల్లడించారు. అధ్యక్షత వహించిన సంస్థ తెనాలి ఛైర్మన్ డాక్టర్ కొలసాని రాంచంద్ సంస్థ కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ కటకం ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ పి శ్రీనివాస్, సెక్రటరీ పి వెంకట్, జాయింట్ సెక్రటరీ డి సోమయ్య శాస్త్రి, సంస్థ సభ్యుల పాల్గొన్నారు.



తహశీల్దార్ కెవి గోపాలకృష్ణను సత్కరిస్తున్న సంస్థ సభ్యులు, అతిథులు

52442 మంది డ్వాక్రాలకు లఖ్‌పతి దీదీ రుణాలు

ప్రజాశక్తి-గుంటూరు

మహారాష్ట్రలోని జలగామ్‌లో ఆదివారం జరిగిన లఖ్ పత్ దీదీ పథకం సభలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్న కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం గుంటూరు కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్ వీక్షించారు. కార్యక్రమం అనంతరం జిల్లాలో జిల్లాలోని 295 స్వయం సహాయక సంఘాలలోని లఖ్ పత్ దీదీలకు బ్యాంకు రుణాలకు సంబంధించి రూ.38,06,00,000 చెక్కును స్వయం సహాయక సంఘాల సభ్యులకు కలెక్టర్ నాగలక్ష్మీ, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్ పంపిణీ చేశారు. చిరువ్యాపారుల ద్వారా జీవనోపాధులు మెరుగుపర్చుకున్న స్వయం సహాయక సంఘాల సభ్యులకు, అర్హత ఉన్న వారిని గుర్తించి లఖ్ పత్ దీదీ పథకం లబ్ధిని అందించిన సీఆర్పీలకు ప్రసంశ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ స్వయం సహాయక సంఘాల సభ్యులు సంవత్సరానికి కనీసం రూ. లక్ష రూపాయిల ఆదాయం సంపాదించే లక్ష్యంతో లఖ్ పత్ దీదీ పథకం ద్వారా వ్యాపారుల ఏర్పాటుకు రుణాలు అందించటం జరుగుతుందన్నారు. జిల్లాలో లఖ్ పతీ దీదీ పథకానికి దాదాపు 52,442 మంది స్వయం సహాయ సంఘాల సభ్యులను లక్ష్యంగా నిర్దేశించటం జరిగిందని, ఇప్పటికే వీరిలో 38,155 మందికి రుణాలు మంజూరుకు గుర్తించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు శారమ్మ, డీఆర్డీఏ అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



డ్వాక్రాలకు మెగా చెక్ అందచేస్తున్న కలెక్టర్, తదితరులు



ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సదరన్ లెక్చరర్, టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ జాతీయ ప్రతిభా పురస్కార కార్యక్రమంలో భాగంగా పలువురు అధ్యాపకులు, ఉపాధ్యాయులకు ఆదివారం స్థానిక ఎసి కళాశాలలో సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యేలు నశీర్ అహ్మద్, గళ్ళా మాధవి, అసోసియేషన్ నాయకులు కన్నా మాస్టారు, మేకల రవీంద్రబాబు పాల్గొన్నారు.

పంపింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగర ప్రజలకు త్రాగునీరు అందించే ఉండవల్లి రావాటర్ ప్లాంట్ 24 గంటలు రన్నింగ్‌లోనే ఉండాలని, అందుకు తగిన విధంగా మోటార్లు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కమిషనర్ ఉండవల్లిలోని ముడినీటి సరఫరా ప్లాంట్, రిజర్వాయర్లను పరిశీలించి, ఇంజినీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత ప్లాంట్‌లోని మోటార్ల సామర్థ్యం, గుంటూరు నగరానికి ప్రతిరోజు పంపింగ్ చేస్తున్న నీటి వివరాలు, ప్రకాశం బ్యారేజ్‌లోని నీటి లెవల్స్, విధుల్లో ఉన్న సిబ్బంది తదితర అంశాలు అధికారులను అడిగి తెలుసుకొని మాట్లాడుతూ గుంటూరు నగరానికి త్రాగునీరు అందించే కీలకమైన ఉండవల్లి పంపింగ్ కేంద్రం పనితీరు మెరుగ్గా ఉండాలన్నారు. పంపింగ్ కేంద్రం 24 గంటలు పని చేయాలని, ఉన్న మోటర్లకు అదనంగా మరో మోటర్‌ని స్టాండ్‌బైలో ఉంచాలన్నారు. సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, బ్యారేజిలో నీటినిల్వ వివరాలను ఎప్పటికప్పుడు తమకు తెలియచేయాలన్నారు. ప్లాంట్ పరిసరాల్లో సిసి కెమెరాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. ప్లాంట్ ప్రాంతానికి చుట్టూ కాంపౌండ్ నిర్మాణం చేయాలని ఎస్ఈని ఆదేశించారు. పర్యటనలో ఎస్.ఈ శ్యాం సుందర్, ఈఈ శ్రీనివాస్, డిఈఈ శ్రీధర్,గుంటూరు నగర రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణ రెడ్డి పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

ఉద్యాన పంటలకు రూ.11.61 కోట్లు రాయితీ

- నర్సరీలపై నిరంతరం నిఘా
- ఆయిల్‌పామ్ సాగుకి రైతుల్లో ఆసక్తి పెంచేందుకు కృషి
- పల్నాడు జిల్లా ఉద్యాన శాఖ అధికారి సిహెచ్. రమణారెడ్డి

పల్నాడు జిల్లాలో ఆయిల్ పామ్, పండ్ల తోటల సాగుకు ముందుకు వచ్చే రైతులకు అవస రమైన సహాయ సహకారాలు అందిస్తామని ఉద్యాన సాగు ద్వారా పల్నాడు జిల్లా రైతులకు రూ.11.61కోట్లు రాయతీల లబ్ధి చేకూరుతుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సిహెచ్. రమణారెడ్డి అన్నారు. ఉద్యాన పంటలలో దీర్ఘకాలిక అధిక ఆదాయం వచ్చే పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం అనుసంధానం ప్రయోజనాలను వివరించారు. ప్రజాశక్తి కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఉద్యాన శాఖ ద్వారా రైతులకు చేకూరే ప్రయోజనాలు ఆయన వివరించారు.

ఉద్యాన పంటల వైపు రైతులను ఎలా ప్రోత్సహిస్తున్నారు ?

గ్రామ సచివాలయ పరిధిలోని రైతులతో గ్రామాలలో రైతు శిక్షణ కార్యక్రమాల పేరిట గ్రామ ఉద్యాన శాఖ అధికారి సమావేశం ఏర్పాటు చేసి ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ఇచ్చే రాయితీలను వివరించి ప్రోత్సహిస్తున్నారు. కరపత్రాలు, గోడ ప్రతులు ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ఉపాధిహామీ పథకం ద్వారా పండ్ల తోటల సాగుకు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తుంది.

పల్నాడు జిల్లాలో ఉద్యాన పంటల సాగు లక్ష్యం?

పల్నాడు జిల్లాలో 2023-24 సంవత్సరంలో ఉద్యాన పంటలు 1,38,137ఎకరాలు సాగు చేయగా 95 శాతం మిర్చి పంట ఉండగా 5 శాతం మాత్రమే వివిధ రకాల పండ్ల తోటలు సాగయ్యాయి. వివిధ ఉద్యాన పంటల సాగుకు సంబంధించి పల్నాడు రైతులకు రూ 11 కోట్ల లబ్ధి చేకూరనుంది. 8 వేల ఎకరాలలో సాగైన వివిధ పండ్ల తోటలకు సంబంధించి రాష్ట్రీయ కృషివికాస్ యోజన పథకం కింద హెక్టారుకు రూ 20 వేలు చొప్పున చిన్న సన్నకారు రైతులకు రాయితీల రూపంలో ఈ ఏడాది రూ. 61 లక్షలు డిబిటి విధానంలో అందజేస్తాం.

పండ్ల తోటలు సాగు చేసిన రైతులకు చేకూరే ప్రయోజనాలు ?

పండ్ల తోటల సాగుకు ముందుకు వచ్చిన రైతులకు మొక్కల దగ్గర నుండి మొక్క నాటేందుకు తీసే గుంతలకు, నీటి వనరు ఉండి ఆ నీటిని మొక్కలకు సరఫరా చేసేందుకు అయ్యే ఖర్చులను ఇతర సూక్ష్మ ఎరువులకు సంబంధించి ఇతర రాయితీలు ఉపాధి హామీ పథకం మరియు ఉద్యాన శాఖ ద్వారా విడతల వారీగా 3 ఏళ్లలో అందజేస్తాము.

ఆయిల్ పామ్ తోటల సాగు వివరాలు, రైతులు ఆసక్తి చూపకపోవడానికి కారణం?

ఆయిల్ పామ్ తోటలకు ఇసుక చౌడు నేలలు తప్ప అన్ని రకాల నేలలు అనుకూలంగా ఉంటాయి. ప్రధానంగా నీటి వనరులు అవసరము. ఒకసారి సాగు చేయడం ద్వారా 30 ఏళ్ల వరకు దీర్ఘకాలిక ఆదాయం పొందవచ్చు. ఆయిల్ పామ్ తోటలకు హెక్టారుకు రూ. 4250 చొప్పున 4 ఏళ్ల పాటు ఆందజేయడం జరుగుతుంది. అంతర పంటల సాగుతో అధిక ఆదాయం పొందే అవకాశం ఉంది. ఆయిల్ పామ్ సాగులో రాష్ట్రంలో ఈస్ట్, వెస్ట్ గోదావరి ప్రాంతాలలో అధిక మొత్తంలో సాగు విస్తీర్ణం ఉంది. పల్నాడు జిల్లాలో ఈ ఏడాది పిడుగురాళ్ల, సత్తెనపల్లి, బెల్లంకొండ, మాచవరం, రాజుపాలెం, అమరావతి, ఈపూరు, నాదెండ్ల మండలాలలో ఆయిల్ పామ్ తోటల సాగుకు రైతులు సమాయత్తం అయ్యారు.





వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీ 6 మండలాలలో గోద్రెజ్ అగ్రోవిట్ కంపెనీ 2 మండలాలలో ఆల్పామ్ సాగుకు ముందుకు వచ్చిన రైతులకు మొక్కలు ఇవ్వడంతో పాటు సలహాలు సూచనలు అందజేస్తారు.

మార్కెటింగ్ సౌకర్యం ఉందా?

రాష్ట్రంలో పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగిలో ప్రభుత్వం ఆధ్వర్యంలో మార్కెటింగ్ బోర్డ్ ఆధ్వర్యంలో కొనుగోళ్ల జరుగుతున్నాయి. కమిటీగా ఉన్న రైతులు, ప్రభుత్వం, ఆయిల్ ఫామ్ కంపెనీ ప్రతినిధులు చర్చించి ధరలు నిర్ణయించడం జరుగుతుంది. ఏడాది పొడవునా దిగుబడి వచ్చే ఆయిల్ పామ్ గెలలు అమ్ముకునేందుకు రైతులు ఇబ్బందులు లేకుండా రానున్న రోజుల్లో ఆయిల్ ఫామ్ తోటల పెంపకాన్ని విస్తరించి ప్రతి మండలంలో కలెక్షన్ సెంటర్ ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం ప్రణాళికలో రూపొందిస్తుంది.

నర్సరీలపై పర్యవేక్షణ ఎలా ఉంది? పల్నాడు జిల్లాలో ఎన్ని నర్సరీలు ఉన్నాయి?

పల్నాడు జిల్లాలో 350 షేడ్ నెట్, 50 బెడ్ నర్సరీలు ఉన్నాయి. ఆ నర్సరీలలో నాణ్యమైన గుర్తింపు పొందిన విత్తనాలు ద్వారా మొక్కలు పెంపకం చేసేలా ఎప్పటికప్పుడు నర్సరీ యాజమాన్యాలకు అవగాహన కల్పించడం తోపాటు తరచూ తనిఖీలు చేస్తున్నాం. పల్నాడు జిల్లాలో ప్రధాన సాగు అయిన మిర్చి మొక్కలు రైతుల అభీష్టం మేరకు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టడం జరుగుతుంది.

రైతులకు ఇంకా ఏమైనా సూచనలు చేస్తారా?

చిన్న సన్నకారు రైతులు ఒకే తరహా పంటల సాగు కాకుండా మార్కెట్‌లో గిరాకీ ఉండే 2 లేదా 3 రకాల పంటలు సాగు చేయడం ద్వారా ఒక పంటకు గిట్టుబాటు ధర దక్కినా దక్కక పోయినా మరో పంటలో నష్టాన్ని అధిగమించే అవకాశం ఉంటుంది. అదేవిధంగా పంటల మార్పిడి విధానం ద్వారా కూడా నేల సారం పెరిగి చీడ పీడల బెడద తగ్గుతుంది. 2 లేదా 3 రకాల పంటల సాగు చేపట్టడం, పంటల మార్పిడితో పాటు తక్కువ పెట్టుబడి తక్కువ కూలీల సంఖ్య దీర్ఘకాలిక ఆదాయం వచ్చే పంటల సాగు చేపట్టి ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా